


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

30.07.2026

గురువారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 78

పేజీలు : 12 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## ఇది ఎన్నికల ప్రచారం కాదు

- నారా భువనేశ్వరి కీలక వ్యాఖ్యలు
- మహిళలను గౌరవించాలనే ఉద్దేశంతో..
- నా మనసులోని మాటను చెబుతున్న
- స్త్రీ అమ్మలాంటిది గుర్తు చేస్తున్నాను
- ద్రౌపది నుంచి నేటి రాజకీయాల వరకు..



2లో..

**కుప్పం, జులై 29, అనంత జనశక్తి న్యూస్**

చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. యామగానపల్లి ధర్మరాజుల స్వామి ఆలయంలో ద్రౌపది అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మాట్లాడారు.

## నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారు

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటు

2లో..



హైదరాబాద్, జులై 29, అనంతజనశక్తి న్యూస్
కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారు.. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు.

## కేటీఆర్‌పై తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్

- ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం
- 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం



2లో..

**హైదరాబాద్, జులై 29, అనంతజనశక్తి న్యూస్**

హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడారు.

# ఏం సందేశమిస్తారు?

- జగన్‌పై చంద్రబాబు ఫైర్
- సాక్ష్యాలు తారుమారు చేసిన వ్యక్తి
- వ్యవస్థల నిర్మాణం చేసేవాళ్లు.. చట్టాలకు లోబడి నడుచుకుంటారు
- గొడ్డలి పార్టీ నేతలకు వాటిపై గౌరవం లేదు
- సచివాలయంలో అందుబాటులో ఉన్న నేతలో
- సీఎం చంద్రబాబు సమావేశం
- రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి చనిపోతే..
- సాక్ష్యాలను తారుమారు చేశారు
- మరొకరి జీవితాన్ని బలిచేద్దామనుకున్నారు

2లో..



**అమరావతి, జులై 29, అనంత జనశక్తి న్యూస్**
వ్యవస్థల నిర్మాణం చేసేవాళ్లు చట్టాలకు లోబడి నడుచుకుంటారని.. గొడ్డలి పార్టీ నేతలకు వాటిపై గౌరవం లేదని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న నేతలో సీఎం సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై వారితో ఆయన చర్చించారు. జైలులో ఉన్న వైకాపా నేత సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ వెళ్తున్న విషయాన్ని నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వ్యవస్థలను నాశనం చేయడాన్ని గొడ్డలి పార్టీ అధినేత లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలను తారుమారు చేసి మరొకరి జీవితాన్ని బలిచేద్దాం అనుకున్నవారిని జగన్ పరామర్శించి సమాజానికి ఏం సందేశం ఇస్తారని ప్రశ్నించారు.

"గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం ఆస్పత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదు. పుట్టినరోజులకు జంతు బలులతో రాక్షసానందం పొందే హింసా ప్రవృత్తి ఆ పార్టీది. నేరాల నియంత్రణకు 201419 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. 201924 మధ్య నిర్వహణ లేక వాటన్నింటినీ నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే వాటిని పునరుద్ధరించడంతో నేరస్థుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతున్నాం. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే హత్యగా చిత్రీకరించి బురదచల్లాలని చూశారు. సీసీటీవీ ఫుటేజ్‌లతో ఆధారాలు బయటపెట్టేసరికి తోక ముడిచారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించడమే గొడ్డలి పార్టీ పనిగా పెట్టుకుంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ వ్యవస్థల్ని నాశనం చేయటమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ అధినేత ఉన్నారంటూ వైఎస్ జగన్‌పై ఆయన మండిపడ్డారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా పరిణామాలపై వారు చర్చించారు. శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించనున్నారనే విషయాన్ని సీఎం దృష్టికి పార్టీ నేతలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. వ్యవస్థల నిర్మాణం చేసే వాళ్లు చట్టాలను గౌరవిస్తూ వాటికి లోబడి నడుచుకుంటారని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కానీ గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటే గౌరవం లేదన్నారు.

## ఉద్యమాల్లో పాల్గొంటే పోలీసు దెబ్బలకు సిద్ధపడాల్సిందే

### నిరసనపై జేపీ నడ్డా ఫైర్



2లో..

**న్యూఢిల్లీ, జులై 29, అనంతజనశక్తి న్యూస్**

విద్యార్థి ఉద్యమాలు, పోలీస్ చర్యలు, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలతో దేశ రాజకీయం తీవ్ర ఉత్కంఠగా మారింది. విద్యార్థి నేతలపై పోలీసుల దాడులపై అధికార, ప్రతిపక్షాల నడుమ పార్లమెంట్ వేదికగా విమర్శల యుద్ధం నడిచింది.

## ప్రభుత్వ వేధింపులే కారణం

### బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ ఫైర్

**హైదరాబాద్, జులై 29, అనంత జనశక్తి న్యూస్**

బీఆర్ఎస్ సీనియర్ నేతసుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా కొనసాగుతున్న వేళ ఆయనకు గుండెపోటు రావడానికి దారితీసిన పరిస్థితులపై ప్రవీణ్ కుమార్ ఆరోపణలు చేశారు.



2లో..

## తిరుపతి కొండల్లో సువాసనలు వెదజల్లే అరుదైన మొక్క

- పేరు పెట్టిన పవన్ కళ్యాణ్
- "క్రోటన్ ఉబ్బల మడుగెన్సిస్" అని పేరు
- తూర్పు కనుమల్లోని కంబకం కొండ ప్రాంతంలో

**అమరావతి, జులై 29, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ .. ఓ అరుదైన మొక్కకు పేరు పెట్టారు. తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో పరిశోధకులు కొత్తగా గుర్తించిన అరుదైన జాతికి చెందిన మొక్కకు పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. ఈ కొత్త వృక్ష జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పవన్ కళ్యాణ్ పేరు పెట్టారు.

2లో..



## అమిత్ షా కాల్పులకు ఆదేశాలు ఇవ్వరు

- మెజిస్ట్రేట్ ఇస్తారు: కేంద్రం
- కాల్పులకు ఆదేశించింది అమిత్ షానే..
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ఆరోపణలు



2లో..

## నేను కూడా మిమ్మల్ని కలవాలనుకుంటున్నా

- ఆదోని చిన్నారుల వీడియోపై లోకేశ్
- మంత్రితో ఫొటో దిగాలని ఉందని ఆకాంక్షిస్తూ
- సోషల్ మీడియాలో చిన్నారుల వీడియో




2లో..

**అమరావతి, జులై 29, అనంతజనశక్తి న్యూస్**

'లోకేశ్ సర్.. మిమ్మల్ని కలవాలి' అంటూ చిన్నారులు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఆదోనికి చెందిన సహస్ర ఆద్య, జయ స్కంద అనే చిన్నారులు.. మంత్రితో ఫొటో దిగాలని ఉందని ఆకాంక్షిస్తూ చేసిన వీడియోపై లోకేశ్ తక్షణమే స్పందించారు.

## పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దు

- టీడీపీ నేతలతో పల్లా శ్రీనివాస్ రావు
- కొంత మంది నేతల వ్యాఖ్యలతో..
- కార్యకర్తలు ఇబ్బందిపడుతున్నారని వ్యాఖ్య



**అమరావతి, జులై 29, అనంతజనశక్తి న్యూస్**
టీడీపీ నేతలు కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందువల్ల నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని ఆదేశించారు. ఎవరైనా గీత దాటితే మాత్రం చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని అందరు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఈ విషయాన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. బుధవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పల్లా శ్రీనివాసరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు.

2లో..

## నన్ను చంపినా.. అరెస్ట్ చేసినా బంగ్లాదేశ్‌కు వెళ్తా

- షేక్ హసీనా కీలక ప్రకటన
- నన్ను చంపొచ్చు.. అరెస్ట్ చేయొచ్చు



**ఢాకా, జులై 29, అనంతజనశక్తి న్యూస్**
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక నిర్ణయం తీసుకున్నారు. తిరిగి తన స్వదేశానికి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రకటించారు.

2లో..

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం
30.07.2026
GENERAL NEWS జనరల్

# నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారు

(మొదటిపేజీ తరువాయి)

కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

**మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం..**

కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

**నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం కూలింది..**

కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఫ్లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# కేటీఆర్‌పై తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# నేను కూడా మిమ్మల్ని కలవాలనుకుంటున్నా

(మొదటిపేజీ తరువాయి)

చిన్నారులు చేసిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో రీపోస్ట్ చేసిన మంత్రి.. 'నేను కూడా మిమ్మల్ని కలవడానికి ఎదురుచూస్తున్నాను' అంటూ ఆప్యాయమైన సందేశాన్ని పంపించారు. తమ అభిమాన నాయకుడిని కలవాలని కోరుతూ చిన్నారులు చేసిన విజ్ఞప్తికి మంత్రి స్పందించడం పట్ల వారి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల పట్ల మంత్రి చూపిన ఆప్యాయతకు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**చిన్నారులు వీడియోలో ఏం చెప్పారంటే..**

'లోకేశ్ సర్.. ఎప్పుడూ మా నాన్న, తాతే మీ దగ్గర ఫొటో దిగుతున్నారు. నేను దిగాలంటే మీరు ఎక్కడో ఉంటున్నారు. వీళ్లు మమ్మల్ని పంపరు. మీరు ఆదోనికి వస్తున్నారు కదా. నన్ను, మా తమ్ముడిని అక్కడి పిలుచుకుని రమ్మని మా నాన్నకు చెప్పండి. ప్లీజ్ సర్' అంటూ మంత్రి లోకేశ్‌ను ఉద్దేశిస్తూ ఇద్దరు చిన్నారుల చెప్పిన మాటలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.

**కార్తికేయ బాగా చూసుకుంటున్నాడా?**

ప్రముఖ దర్శకుడు రాజమౌళి కోడలు పూజతో మంత్రి నారా లోకేశ్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం పునాదిపాడులో మహిళా జూనియర్ కళాశాల నిర్మాణానికి కార్తికేయ అత్త విరాళం ఇచ్చారు. ఆ కళాశాల ప్రారంభోత్సవానికి లోకేశ్‌తో పాటు కార్తికేయ, పూజ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ వారితో సరదాగా ముచ్చటించారు. 'ఏమ్మా కార్తికేయ బాగా చూసుకుంటున్నాడా?' అని సరదాగా అడిగారు.

# అమిత్ షా కాల్పులకు ఆదేశాలు ఇవ్వరు

న్యూఢిల్లీ, జులై 29, అనంతజనశక్తి న్యూస్



లోక్‌సభలో యాంటీపేపర్ లీక్ బిల్లు, విద్యార్థి నిరసనలపై ప్రతిపక్షాలు ఎన్డీయే సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశాయి. కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘర్షణల్లో అమిత్ షానే కాల్పులు జరిపేందుకు భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. అయితే, కేంద్రం ఈ ఆరోపణల్ని తీవ్రంగా ఖండించింది. దీనికి సంబంధించిన ఆధారాలు ఉంటే సభ ముందు ఉంచాలని సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల్ని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఖండించారు. పరిపాలన ఎలా పనిచేస్తుందో ప్రతిపక్ష నేతకు అవగాహన లేదని విమర్శించారు. ఏ పరిస్థితుల్లోనైనా కాల్పులకు ఆదేశాలు ఇవ్వగలిగే అధికారం మంత్రి వద్ద ఉండదని, కేవలం మెజిస్ట్రేట్ లేదా సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్‌లకు మాత్రమే ఇలాంటి నిర్ణయాలు తీసుకోగలరని ఆయన అన్నారు. విద్యార్థులపై ఎలాంటి కాల్పులు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. నిరసనకారుల్ని చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ మాత్రమే ఉపయోగించారని, కాల్పులు జరగలేదని పేర్కొన్నారు. అంతకుముందు రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. విద్యార్థులపై జరిగిన దాడికి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి ఆదేశాలు ఇచ్చి ఉండాలి, లేదా అలాంటి చర్యల గురించి ఆయనకు తెలియకపోయి ఉండొచ్చని అన్నారు. మొదటి పరిస్థితుల్లో ఆయన బాధ్యత వహించాలని, ఆయనకు తెలియకపోతే మంత్రిగా ఆయన అసమర్థుడు అని అన్నారు. ఆయన సభకు వచ్చి సమాధానం ఎందుకు ఇవ్వడం లేదు? అని ప్రశ్నించారు.

# ఏం సందేశమిస్తారు?

(మొదటిపేజీ తరువాయి)



గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలు తారుమారు చేసి ఇంకొకరి జీవితాన్ని బలి చేద్దామనుకున్న వారిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఏం మెసేజ్ ఇస్తారంటూ వైసీపీ అధినేత తీరును ఎండగట్టారు. గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం అతడిని ఆసుపత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదని అన్నారు. పుట్టిన రోజులకు గొడ్డళ్లతో జంతు బలులు చేసి రాక్షసానందం పొందే హింస ప్రవృత్తి ఆ పార్టీదని ఆయన అభివర్ణించారు. నేరాల నియంత్రణకు 201419 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అయితే 201924 మధ్య వాటికి మెయింటైనెన్స్ లేకపోవడంతో అవి నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే.. వాటన్నింటినీ పునరుద్ధరించటంతో నేరస్తుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే.. దానిని హత్యగా చిత్రీకరించి రాజకీయంగా ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. సీసీ టీవీ ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోక ముడిచారంటూ ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి.. దానిని ఎదుటి వారిపై రుద్దాలని చూస్తారని వ్యాఖ్యానించారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్తుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు.

# నన్ను చంపినా.. అరెస్ట్ చేసినా బంగ్లాదేశ్‌కు వెళ్తా

(మొదటిపేజీ తరువాయి)

2024లో జరిగిన అల్లర్ల తర్వాత భారత్‌కు వచ్చి తల దాచుకుంటున్నారు. తాజాగా షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. అరెస్ట్ కావొచ్చని, జైలుకు వెళ్లాల్సి రావొచ్చని, ప్రాణాలకు కూడా ముప్పు ఉండొచ్చని తెలిసినా ఈ ఏడాది డిసెంబర్ నాటికి స్వదేశానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వస్తున్న పిలుపు కారణంగానే తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ఏఎఫ్‌పీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో 78 ఏళ్ల షేక్ హసీనా మాట్లాడుతూ.. "నన్ను చంపేయవచ్చు. నన్ను అరెస్ట్ చేయవచ్చు. జైలుకు కూడా పంపవచ్చు. నా భవితవ్యం ఏమిటో నాకు పూర్తిగా తెలుసు. అయినప్పటికీ నా ప్రజలు నన్ను తిరిగి రావాలని కోరుకుంటున్నారు. అందుకే నేను నా దేశానికి వెళ్లాలనుకుంటున్నాను." అని పేర్కొన్నారు. తనను భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు అప్పగించాలంటూ జరుగుతున్న చర్చలకు, స్వదేశానికి తిరిగి వెళ్లాలన్న నిర్ణయానికి ఎలాంటి సంబంధం లేదని హసీనా స్పష్టం చేశారు.

షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం అధికారికంగా భారత్‌ను కోరింది. ఈ అభ్యర్థన పరిశీలనలో ఉందని భారత్ గతంలో వెల్లడించింది. అయితే తన భవిష్యత్తు ప్రణాళికలపై అప్పగింత అంశం ఎలాంటి ప్రభావం చూపలేదని హసీనా తెలిపారు. భారత్‌లో తనకు తగిన గౌరవం, మర్యాద లభిస్తున్నాయని.. బంగ్లాదేశ్‌కు అప్పగించే అంశంపై భారత అధికారులు తనతో ఎలాంటి చర్చలు జరపలేదని.. తానే దేశానికి తిరిగి వెళ్లాలని స్వయంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు.



2024లో హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత బంగ్లాదేశ్‌లో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వ హయాంలో భారత్‌బంగ్లాదేశ్ సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే ఫిబ్రవరిలో తారిక్ రెహమాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు క్రమంగా మెరుగుపడినట్లు తెలుస్తోంది. తన 15 ఏళ్ల పాలనలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలను షేక్ హసీనా తిరస్కరించారు. తమ ప్రభుత్వంపై వచ్చిన అనేక ఆరోపణలు రాజకీయ ఉద్దేశాలతో చేసినవేనని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను అణచివేయడం, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం, విమర్శకులపై ప్రభుత్వ సంస్థలను ఉపయోగించడం వంటి ఆరోపణలను మానవ హక్కుల సంస్థలు గతంలో హసీనా ప్రభుత్వంపై చేశాయి. ఈ ఆరోపణలపై స్పందించిన హసీనా.. "ఎప్పుడైనా ఆరోపణలు వచ్చినప్పుడు విచారణలు చేపట్టాం. నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూశాం." అని తెలిపారు. 2024లో విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల సమయంలో అధిక బలప్రయోగానికి తాను అనుమతి ఇచ్చినట్లు వస్తున్న ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "విద్యార్థుల ఉద్యమం శాంతియుతంగా ముగిసేలా మా ప్రభుత్వం అత్యంత ఓపికతో వ్యవహరించింది. సమస్యకు శాంతియుత పరిష్కారం చూపేందుకు ప్రయత్నించాం." అని చెప్పారు. అయితే ఆ ఉద్యమం తర్వాత కేవలం విద్యార్థుల నిరసనగా మాత్రమే మిగలలేదని ఆరోపించారు. "రహస్య ఆదేశాలు, ప్రణాళికాబద్ధమైన హింస, ప్రచారం, ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే లక్ష్యంతో ఆ ఉద్యమం ముందుకు సాగింది." అని వ్యాఖ్యానించారు.

భారత్‌లో ఇటీవల జరిగిన యువత ఆధ్వర్యంలోని నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసిన పరిణామాలపై స్పందించేందుకు హసీనా నిరాకరించారు. బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిన తర్వాత మళ్లీ క్రియాశీల రాజకీయాల్లో పాల్గొంటారా అనే ప్రశ్నకు కూడా ఆమె నేరుగా సమాధానం ఇవ్వలేదు. ప్రస్తుతం ఆమె అవామీ లీగ్ పార్టీపై బంగ్లాదేశ్‌లో సమర్థవంతంగా నిషేధం కొనసాగుతోంది. అయితే "అధికారం నా లక్ష్యం కాదు. ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం." అని హసీనా పేర్కొన్నారు.

2024లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అణచివేసే ప్రయత్నాల్లో సుమారు 1,400 మంది వరకు ప్రాణాలు కోల్పోయినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. గత నవంబర్‌లో ఢాకాలోని ఒక కోర్టు షేక్ హసీనాను మానవత్వానికి వ్యతిరేక నేరాలకు దోషిగా నిర్ధారించి ఉరిశిక్ష విధించింది. అయితే ఈ తీర్పును హసీనా తీవ్రంగా ఖండించారు. ఇది చట్టం ముసుగులో జరుగుతున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆరోపించారు. నిరసనల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల గురించి ప్రశ్నించగా.. తమ ఆప్తులను కోల్పోయిన ప్రతి కుటుంబం పట్ల తనకు సానుభూతి ఉందని చెప్పారు. అయితే జరిగిన ఘటనలకు క్షమాపణ చెప్పేందుకు మాత్రం నిరాకరించారు. ఆ సంక్షోభ సమయంలో తీసుకున్న నిర్ణయాలపై తనకు పశ్చాత్తాపం ఉందా అనే ప్రశ్నకు కూడా హసీనా స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. "రాష్ట్రానికి సంబంధించిన నిర్ణయాలను ఒక్క వ్యక్తి మాత్రమే తీసుకోడు. మొత్తం సంక్షోభాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఒకే సంఘటనను విడిగా చూసి నిర్ణయాలను నిష్పాక్షికంగా అంచనా వేయలేం." అని షేక్ హసీనా పేర్కొన్నారు.

# పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దు

(మొదటిపేజీతరువాయి)

బోండా ఉమా వివరణతో టీడీపీ హైకమాండ్ సంతృప్తి.. టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో టీడీపీ హైకమాండ్ సంతృప్తి చెందిందని తెలిపారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. పార్టీ నియమావళికి అందరు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. వైసీపీ నేతలతో టీడీపీ నేతలు ఎవరు వేదిక పంచుకోవద్దని హుకుం జారీ చేశారు. ఎక్కడైనా నివాళులు అర్పించాల్సి వేస్తే వెళ్లి రావాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. అందరు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

**గొడ్డలి పార్టీ ఏపీని సర్వనాశనం చేసింది: మంత్రి నిమ్మల**

రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కూటమి ప్రయత్నిస్తోందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం నాడు కూటమి ఏర్పడిందని పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరు కూడా అధినేతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు, లైన్‌కు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. మనకు వచ్చిన గౌరవం, అధికారం పార్టీ ద్వారా, చంద్రబాబు ద్వారా వచ్చిందని నేతలు అందరు తెలుసుకోవాలని తెలిపారు. పార్టీ లైన్ దాటిన వారిని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎవరైనా కూడా ఎంతటివారు అయినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



**బాధ్యతాయుతంగా ఉండాలి..**

ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి నిమ్మల సూచించారు. కూటమి ధర్మాన్ని పాటించకపోతే మాత్రం ఎంతటి వారైనా కూడా ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారని అన్నారు. కొంతమంది నేతలను పిలిపించి మాట్లాడుతున్నామని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనేది అందరు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీకి, కూటమికి ఎవరైనా విఘాతం కలిగిస్తే మాత్రం హై కమాండ్ ఊరుకోదని హెచ్చరించారు. అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని ఎవరైనా మాట్లాడితే మాత్రం ఉపేక్షించవద్దని చంద్రబాబు స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# ఉద్యమాల్లో పాల్గొంటే పోలీసు దెబ్బలకు సిద్ధపడాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

నిరసనల్లో పాల్గొనే విద్యార్థులను అదుపులోకి తీసుకోవడం సహజమేనని, శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు పోలీసు చర్యలు పూర్తిగా సమర్థనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, రాజ్యసభ నాయకుడు జేపీ నడ్డా స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనేవారు పోలీస్ చర్యలకు సిద్ధపడాల్సిందేనంటూ వ్యాఖ్యానించారు. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) రోజుల్లో విద్యార్థి నాయకుడిగా ఉన్న తాను కూడా క్లాస్‌రూమ్ నుంచే రెండుసార్లు అరెస్ట్ అయ్యానని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అయితే బీజేపీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యానికి, ప్రజల ప్రాణాలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఘాటుగా విమర్శించారు. జులై 20న విద్యార్థి నిరసనకారులపై క్రూరంగా దాడి చేసిన వాళ్లు ఇంకా నిర్భయంగా తిరుగుతున్నారని మండిపడ్డారు. ఈ పోలీస్ క్రూరత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ దీనిపై దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని విపక్షాలు పట్టుబట్టాయి. మరోవైపు, సీపీఐ(ఎమ్) జాతీయ కార్యాలయంలోకి ఢిల్లీ పోలీసులు అకస్మాత్తుగా ప్రవేశించి, విద్యార్థి నాయకురాలు ఐషే ఘోష్‌ను అరెస్ట్ చేయడానికి యత్నించిన ఘటన ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనడమే ఆమె చేసిన ఏకైక నేరమా అని సీపీఐ(ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో ప్రశ్నించారు. ఒక జాతీయ పార్టీ కేంద్ర కార్యాలయంలోకి చొరబడి దాడులు చేయడంపై తాను స్వయంగా పోలీసులను నిలదీశానని, అయితే 2021 నాటి జేఎన్యూ నిరసన కేసును సాకుగా చూపించారని ఆయన ఆరోపించారు. విపక్షాల నిరసనలను అణచివేయడానికే కేంద్రం ఇలాంటి దమనకాండకు ఒడిగడుతోందని దుయ్యబట్టారు.

సభలో ఇతర కార్యకలాపాలు చేపట్టే ముందే హోంమంత్రి దీనిపై ప్రకటన చేయాలంటూ విపక్షాలు చేపట్టిన ఆందోళనలతో లోక్‌సభ తీవ్ర గందరగోళంగా మారింది. పేపర్ లీక్ నిరోధక బిల్లుపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడటానికి ముందు కూడా ప్రతిపక్షాలు రగడను కొనసాగించడంతో, సభను వాయిదా వేస్తానని స్పీకర్ హెచ్చరించాల్సి వచ్చింది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ.. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించి, బలప్రయోగం చేయడం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలం నాటి రజకార్ల అణచివేత కంటే అత్యంత ఘోరంగా ఉందని, దేశంలో అణచివేత వాతావరణం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



# తిరుపతి కొండల్లో సువాసనలు వెదజల్లే అరుదైన మొక్క

(మొదటిపేజీ తరువాయి)

ఉబ్బలమడుగు జలపాతం సమీపంలో ఉన్న కంబకం కొండల ప్రాంతంలో ఈ మొక్కను గుర్తించిన నేపథ్యంలో.. ఆ ప్రాంతాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. పవన్ కళ్యాణ్ నామకరణం చేసిన క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ మొక్కకు ఓ ప్రత్యేకత ఉంది. ఇది అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగి ఉంటుంది. ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా అరుదైన ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో ఈ మొక్క.. సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్‌తో పోలిస్తే ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు పరిశోధకులు నిర్ధారించారు. తాజా ఆవిష్కరణ.. తూర్పు కనుమలలోని అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబిస్తోందన్న అధికారులు.. ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడంతో పాటు, ఈ మొక్కలు ఉన్న సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోందని ఏపీ డిప్యూటీ సీఎంవో తెలిపింది. మరోవైపు తూర్పు కనుమలలో అరుదైన వృక్ష జాతి మొక్క కనిపించడంతో.. ఈ ప్రాంతంలో మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని వృక్షశాస్త్ర నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఇది ఎన్నికల ప్రచారం కాదు

(మొదటిపేజీ తరువాయి)



ఇది ఎన్నికల ప్రచారం కాదని, మహిళలను గౌరవించాలనే ఉద్దేశంతో తన మనసులోని మాటను చెబుతున్నానని పేర్కొన్నారు. స్త్రీ అమ్మలాంటిది అది మగవారికి గుర్తుకు తేవడానికి చేబుతున్నాను.. మహాభారతంలో కౌరవులు భర్తను అవమానించాలనే ఉద్దేశంతో ద్రౌపది అమ్మవారి వస్త్రాపహరణంకు పాల్పడ్డారని గుర్తు చేశారు. భర్తను దెబ్బతీయడానికి మహిళలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని హితవు పలికారు.. గతంలో అసెంబ్లీలో చంద్రబాబును రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు తన పేరును లాగారని, తనపై కూడా లేనిపోని వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఎలాంటి వ్యక్తినో నా భర్తకు తెలుసు.. ప్రజలకు కూడా తెలుసు. నేను ఎవరికీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు" అని భువనేశ్వరి స్పష్టం చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడే హక్కు ఎవరికీ లేదని, ధైర్యం ఉంటే నేరుగా రాజకీయంగా ఎదుర్కోవాలని, మహిళలను వివాదాల్లోకి లాగడం తగదని అన్నారు. ఇక, చంద్రబాబు నాయుడు ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్న ఆమె, గత ఎన్నికల్లో ప్రజల రూపంలో దేవుడే తమకు అండగా నిలిచారని భావోద్వేగంతో వ్యాఖ్యానించారు.. మహాభారతంలో ద్రౌపదికి శ్రీకృష్ణుడు అండగా నిలిచినట్లే, తమ కుటుంబానికి ప్రజలు అండగా నిలిచారని, ఆ మద్దతును జీవితాంతం మరచిపోలేనని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి.

# ప్రభుత్వ వేధింపులే కారణం



(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపులే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం క్షీణించడానికి కారణమని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడి ప్రమేయంతో ఆయనపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. నర్సంపేటలో కొంతమంది వ్యాపారులు భూములు విక్రయించిన వ్యవహారంలో సీఎం సన్నిహితుడు ఆసక్తి చూపారని, అనంతరం ఆ భూముల వ్యవహారంపై ఈఓడబ్ల్యూలో కేసులు నమోదు చేసి, సుదర్శన్ రెడ్డికి సన్నిహితులైన వ్యాపారులను విచారణ పేరుతో తీవ్రంగా వేధించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

ఈ కేసులో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును చేర్చాలని ఒత్తిడి తీసుకొచ్చారని.. ఆయన పలువురు అధికారులను సంప్రదించినా ఎలాంటి ఉపశమనం లభించలేదని చెప్పారు. గురుకుల బంకర్ బెడ్ల కొనుగోలు వ్యవహారం, సివిల్ సప్లైస్‌లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించారని.. ఈ నేపథ్యంలోనే రూ.1,100 కోట్ల సివిల్ సప్లైస్ స్కాం, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలో బంకర్ బెడ్ల కొనుగోలు వ్యవహారంపై ఉన్నతాధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, హైకోర్టు, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఈ అంశాలే పెద్ది సుదర్శన్ రెడ్డిని టార్గెట్ చేయడానికి కారణం అయ్యాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఎంత క్రూరంగా ఉందో పెద్ది సుదర్శన్ రెడ్డి ఉదంతమే నిదర్శనమని విమర్శలు చేశారు. మరోవైపు.. గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి విడుదల చేసిన తాజా హెల్త్ బులెటిన్ ప్రకారం, తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా ఆయనకు కార్డియాక్ అరెస్ట్ సంభవించిందని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డికి వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోందని.. బీపీ, ఇతర కీలక అవయవాల పనితీరు నిలకడగా ఉన్నప్పటికీ మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో న్యూరాలజికల్ స్పందన కనిపించడం లేదని వెల్లడించారు. 72 గంటల న్యూరాలజికల్ రీ అసెస్‌మెంట్ తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశముందని యశోద ఆస్పత్రి డాక్టర్లు పేర్కొన్నారు.

# కేంద్రం మాట తప్పుతోంది: సీజేపీ



సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వును అడ్డుపెట్టుకొని, నిరసనకారులపై కేసుల ఎత్తివేత విషయంలో కేంద్ర ప్రభుత్వం మాట తప్పుతోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపించింది. ఇటీవలి ఆందోళనల్లో పాల్గొన్న అనేక మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వేధింపులకు గురవుతున్నారని పేర్కొంది. తమకిచ్చిన హామీలను సర్కారు నిలబెట్టుకోకపోతే.. ఈసారి దిల్లీలోనే కాకుండా, దేశవ్యాప్తంగా భారీ నిరసనలకు దిగుతామని హెచ్చరించింది. నిరసనకారులపై ఎఫ్ఐఆర్ల ఉపసంహరణ సహా పలు అంశాలపై మునుపటి చర్చల్లో ఇచ్చిన హామీలను.. గడువు ముగిసినా ప్రభుత్వం తమకు రాతపూర్వకంగా అందించలేదని తెలిపింది. ఈ నెల 20న నిరసనకారులపై పోలీసులు బలప్రయోగానికి దిగిన వ్యవహారంపై చర్చించాలని పార్లమెంటును సీజేపీ కోరింది. ఈ విషయంలో పోలీసులనే పూర్తి బాధ్యులను చేయకుండా, కేంద్ర హోం మంత్రి పాత్రపైనా చర్చ జరపాలని విన్నవించింది. మరోవైపు నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఇటీవల తమ రాష్ట్రాల్లో నిరసనల్లో పాల్గొన్నవారిపై కేసులు ఎత్తివేయాలని మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు నిర్ణయించాయి.

వ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తేనే..

సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ.. ''నిరసనలపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుతో.. ఎఫ్ఐఆర్ల ఉపసంహరణ అనేది కోర్టు పరిధిలోని అంశంగా మారిందని మంగళవారం మాతో జరిపిన చర్చల్లో కేంద్రం పేర్కొంది. మునుపటి చర్చల్లో కుదిరిన అంగీకారాలపై అది రాతపూర్వక హామీలను అందించలేదు. సుప్రీం మధ్యంతర ఉత్తర్వును ఆసరాగా చేసుకొని.. దేశ యువతకు ఇచ్చిన హామీలపై సర్కారు వెనక్కి తగ్గాలనుకుంటోంది'' అని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన అక్రమాలపై ఫాస్ట్రాక్ కోర్టులతో విచారణ జరిపించాలన్న ప్రతిపాదన కేవలం బ్యాండెయిడ్ చర్యేనని సౌరవ్ దాస్ పేర్కొన్నారు. వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చినప్పుడే పరిస్థితి చక్కబడుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోవడం సిగ్గుచేటని సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆశుతోష్ రాంకా జైపుర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పేర్కొన్నారు.

అంతకుముందు ''ఇప్పటికే దాఖలైన ఎఫ్ఐఆర్లపై ముందుకెళ్లేందుకు, దర్యాప్తులను కొనసాగించేందుకు సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులోని డైరెక్షన్ నంబరు4 అనుమతిస్తోంది. దాన్ని అడ్డుపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం, భాజపా పాలిత రాష్ట్రాలు నిరసనకారులపై కేసులను కొనసాగించే ముప్పుంది'' అని సౌరవ్ దాస్ ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.

**విద్యార్థులను వేధిస్తున్నారు: దీప్కే**

దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో విద్యార్థులను పోలీసులు వేధిస్తున్నారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భారీ శాంతియుత నిరసన చేపడతామని 'ఎక్స్'లో హెచ్చరించారు.

**అల్లర్లకు పాల్పడినవారిని క్షమించొద్దు: భాజపా**

సీజేపీ నిరసనలపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వును భాజపా స్వాగతించింది. ఆందోళనల్లో పాల్గొన్న సిసలైన విద్యార్థులకు రక్షణ దక్కాల్సిందేనని పేర్కొంది. విద్యార్థుల ముసుగులో అల్లర్లకు పాల్పడినవారిని మాత్రం క్షమించకూడదని అభిప్రాయపడింది. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

**నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ**

నీట్‌యూజీ 2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ మంగళవారం ప్రత్యేక ఫాస్ట్రాక్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిపై కోర్టు బుధవారం విచారణ జరిపే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసులో ఇప్పటివరకు సీబీఐ 13 మందిని అరెస్టు చేసింది. వారంతా జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# కేసుల్లేని మైనర్లను విడుదల చేయండి

**- నీట్ పేపర్ లీకేజీ వ్యతిరేక ఆందోళనలపై అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం**



పోటీ పరీక్షల్లో అక్రమాలు, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఉద్యమించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోకుండా రాష్ట్రాలను నియంత్రిస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న నేరచరితలేని మైనర్లను వెంటనే విడుదల చేయాలని పేర్కొంది. దిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసనకారుల పట్ల అత్యంత కర్కశకంగా వ్యవహరించారంటూ పోలీసులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి నిష్పాక్షిక, స్వతంత్ర దర్యాప్తునకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

'చలో పార్లమెంటు' నిరసనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్లపై దిల్లీ ప్రభుత్వం దర్యాప్తు కొనసాగించవచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం తెలిపింది. అయితే, విద్యార్థులపై ఎలాంటి తక్షణ, కఠిన చర్యలు తీసుకోవద్దని సూచించింది. నేరాభియోగాలున్న ఆందోళనకారులకు ఈ ఉత్తర్వులు వర్తించవని మంగళవారం విచారణ సందర్భంగా స్పష్టం చేసింది.

''విద్యార్థుల నిరసనల సమయంలో పోలీసులపై అనేక ఆరోపణలు వచ్చాయి. పోలీసుల చర్యల కారణంగా మహిళలు, న్యాయవాదులు, మీడియా వ్యక్తులు గాయపడినట్లు కథనాలు వస్తున్నాయి. వీటిపై స్వతంత్ర దర్యాప్తు ఎందుకు చేయకూడదు? శాంతియుత నిరసనల నిర్వహణ, పోలీసుల చర్యలకు సంబంధించి దేశవ్యాప్తంగా ఏకరూప మార్గదర్శకాలు రూపొందించాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే విచారించి శిక్షించాలి'' అని ధర్మాసనం వెల్లడించింది. 250 మంది పోలీసులపై ఆందోళనకారులు దాడి చేసినట్లు వచ్చిన నివేదికలపైనా దర్యాప్తు జరగాలని అభిప్రాయపడింది. ఈ దాడులు చేసింది విద్యార్థులా లేదా నేరగాళ్ల అన్నది తేల్చాలని పేర్కొంది.

**సిట్ ఏర్పాటుపై మీ అభిప్రాయం తెలపండి**

స్వతంత్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలన్న తమ నిర్ణయంపై అభిప్రాయాలను తెలియజేయటానికి కేంద్రం, రాష్ట్రాలకు అవకాశం ఇస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణకు అడ్వొకేట్స్ జనరల్‌ను ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యేటట్లు చూడాలని మహారాష్ట్ర, బిహార్, అస్సాం, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్స్, బాడీకెమేరా ఫుటేజీ తదితర వీడియో సాక్ష్యాలను భద్రపర్చాలని రాష్ట్రాలను ఆదేశించింది. డిజిటల్ డేటాతో పాటు నిరసనకారుల వ్యక్తిగత సమాచారాన్నీ పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకురావొద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

# 'ఎమర్జెన్సీ' సమయంలో నిరసన చేస్తే.. నన్నూ అరెస్ట్ చేశారు: జేపీ నడ్డా



**దిల్లీలో నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుబట్టారు. ఈ విషయంపై రాజ్యసభలో మాట్లాడుతూ.. అణచివేతకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు తాను కూడా చాలాసార్లు అరెస్టయినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించినప్పుడు పోలీసులు తనను తరగతి గదిలోనే అరెస్ట్ చేశారని వెల్లడించారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే ఏ విద్యార్థి అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా పేర్కొన్నారు.**

**ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సీజేపీకి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నందుకు పోలీసులు బుధవారం సీపీఎం ఆఫీస్‌పై దాడి చేశారని ఆ పార్టీ ఎంపీలు చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి ఖండించారు. దీంతో రాజ్యసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.**

**బిల్లుపై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి: రిజిజు**

**యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు.**

# అతడి వయసులో నేను రెండు జాతీయ అవార్డులు సాధించా: కంగనా రనౌత్

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జెన్‌జీ నిరసనకారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మరోసారి వార్తల్లో నిలిచారు. కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్‌పై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అతడో పనికిరాని వ్యక్తి అని మండిపడ్డారు. అతడి వయసులో తాను రెండు జాతీయ అవార్డులు సాధించానని తెలిపారు. అసలేం జరిగిందంటే..

జెన్‌జీ నిరసనకారులు గట్టర్ జనరేషన్ (మురికి కాలువ లాంటివారు) అంటూ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలకు సౌరవ్ దాస్ స్పందించారు. ''ఆమె వ్యాఖ్యలను సొంత పార్టీ వారే సీరియస్‌గా తీసుకోరు. మేమెందుకు బాధపడాలి. ఆమె చెప్పే మాటలను జెన్‌జీ, జెన్‌ఆల్ఫా లాంటి యువ తరం పట్టించుకుంటుందని నేను అనుకోను. ఈ దేశానికి కంగన చేసిన దానికంటే.. యువతరమే ఎక్కువ చేసింది. హిమాచల్ ఎంపీగా తన నియోజకవర్గానికి వెళ్లిన ఆమె.. చిన్న పనికే ఇబ్బంది పడ్డారు. తాను చేయలేనని చెప్పారు. ఆమె ఎంత సీరియస్‌గా ఉంటారో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు'' అని విమర్శించారు. దీంతో సీజేపీ ప్రతినిధికి కంగన ఘాటుగా బదులిచ్చారు.



''ఈ వ్యక్తి (సౌరవ్ దాస్) కోసం నెట్టింట వెతికాను. 28 ఏళ్ల విద్యార్థి అని వచ్చింది. కానీ నాకు నమ్మకం లేదు. అవును.. నేను గత రెండేళ్లుగానే రాజకీయాల్లో ఉండొచ్చు.. కానీ 20 ఏళ్లుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నా. అతడి వయసులో నేను రెండు జాతీయ అవార్డులు సాధించా. నిజమే పార్లమెంట్ సభ్యురాలిగా నాకు పనిభారం ఎక్కువగా ఉందని అన్నాను. ఎందుకంటే నేను ఎంపీ మాత్రమే కాదు.. దర్శకురాలు, నటి, నిర్మాత, స్క్రీన్ రైటర్, వ్యాపారవేత్తగా ఎన్నో విధులు నిర్వర్తిస్తున్నా. కానీ, పనికిరాని, నిరుద్యోగి అయిన నీలాంటి వ్యక్తికి... ఏ వయసులోనైనా బిజీగా ఉండటం అనేది ఎప్పటికీ అర్థం కాదు. సౌరవ్.. నీది వ్యక్తిగత సమస్యే. నువ్వు విద్యార్థివి కాదు. ఇకనైనా కొన్ని నైపుణ్యాలు నేర్చుకో'' అని కంగనా రనౌత్ మండిపడ్డారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాలు సవరణలు కోరినప్పటికీ అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారికి కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది.**




# జెన్ అల్ఫా 'సర్వోదయం'



**- కనీస సౌకర్యాల కోసం గొంతెత్తిన విద్యార్థులు**

**- యూపీలో ఆందోళనతో సాధించుకున్న వైనం**

జెన్‌జీ నుంచి స్ఫూర్తి పొందారో ఏమో.. ఉత్తర్ ప్రదేశ్‌ల జెన్ ఆల్ఫా...విద్యార్థులూ ఆందోళన చేసి కనీస సౌకర్యాలను సాధించుకున్నారు. 5 గంటలపాటు వందల మంది ఇంటర్మీడియెట్ చదువుతున్న జెన్ అల్ఫా విద్యార్థులు ఆందోళన చేయడంతో తాగునీరు, ఫ్యాన్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, లైబ్రరీ ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కిషన్‌పుర్‌లోని సర్వోదయ ఇంటర్ కళాశాలలో మంగళవారం ఈ ఆందోళన జరిగింది. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాలతోపాటు జాతీయ జెండాను, ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆగ్రహంతో ఉదయం 7 గంటలకు కళాశాల గేట్లు తెరవగానే విద్యార్థులు ఆందోళనకు దిగారు. సురక్షిత తాగునీరు, పరిశుభ్ర మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యం, ఫ్యాన్లు, బల్లలు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, క్రీడా సౌకర్యాలు సరిగా లేవని మండిపడ్డారు. దీంతోపాటు అడ్మిషన్ల సమయంలో యాజమాన్యం అదనంగా వసూళ్లకు పాల్పడుతోందని, మార్కుల ధ్రువపత్రాలు, ఇతర డాక్యుమెంట్లు ఇవ్వడానికి అధికంగా డబ్బులు గుంజుతున్నారని ఆరోపించారు. ఆందోళనలో 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్నం సమయంలో పాఠశాలల జిల్లా తనిఖీ అధికారి వచ్చి హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. 24 గంటల్లోగా పనులు ప్రారంభిస్తామని కళాశాల యాజమాన్యం హామీ ఇచ్చింది.

# 30 రోజులకు మించి స్టాకు నిల్వ ఉంచరాదు



**- చక్కెర ధరల నియంత్రణకు ప్రభుత్వ ఆదేశాలు**

చక్కెర ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా చక్కెర డీలర్లు 30 రోజులకు మించి స్టాకు నిలువ ఉంచరాదని, గరిష్ఠంగా 4 వేల కింటాళ్ల వరకూ మాత్రమే నిల్వ ఉంచాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశించింది. ఏ సమయంలోనైనా, ఏ స్థలంలోనైనా ఇంతకు మించి నిల్వలు ఉంచడానికి వీల్లేదని తెలిపింది. ఇందుకు సంబంధించిన లెక్కలను ప్రతిరోజూ ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాల్సిందేనని నిర్దేశించింది. ఆ ఆదేశాలు ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు అమలులో ఉంటాయి.

'చక్కెర డీలర్లు సరుకును సమకూర్చుకున్న తేదీ నుంచి 30 రోజులకు మించి స్టాకును నిల్వ ఉంచకూడదు. దేశంలో ఎక్కడా ఏ డీలరూ 4 వేల క్వింటాళ్లకు మించిన చక్కెర స్టాకు కలిగి ఉండకూడదు' అని నోటిఫికేషన్ స్పష్టం చేసింది. ఈసారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం ఇప్పటికే చక్కెర ఎగుమతుల్ని నిషేధించింది. చక్కెర స్టాకు నియంత్రణకై ప్రభుత్వం వెలువరించిన తాజా ఆదేశాలు ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డీలర్లకు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నియమించిన అధికారులకు వర్తించవు.

# పెళ్లి బెంగతో యువకుల ఆత్మహత్యలు



యుక్త వయసు వచ్చాక జీవిత భాగస్వామిని వెదుక్కోవడం, పెళ్లి చేసుకొని స్థిరపడటం యువత కనే అందమైన కల. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ఇదే కొందరి పాలిట శాపంగా మారి, ప్రాణాలు తీసుకునేటంత మానసిక బలహీనతకు దారితీస్తోంది. మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లా పోలీసులు ఒక ప్రత్యేక సర్వే చేశారు. ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో ఆ జిల్లాలో మొత్తం 443 మంది వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో పెళ్లి కాలేదనే బెంగతో బలవన్మరణాలకు పాల్పడిన యువకులు 29 మంది. వివాహ వయసు దాటినా సరైన తోడు దొరక్కపోవడం, బంధుమిత్రుల ఒత్తిళ్లు, మానసిక ఆందోళనలు యువకులను ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నట్లు సర్వే డేటా స్పష్టం చేస్తోంది.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం
30.07.2026




# సుస్థిర వృద్ధికి 'స్వర్ణ' సంకల్పం

స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు నిండే నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని భారత్ ఆకాంక్షిస్తోంది. ఈ లక్ష్య సాధనకు సమ్మిళిత, సుస్థిర వృద్ధిని సాధించాలనుకుంటోంది. ఆశించిన ఫలితాలు సాధించాలంటే పథకాల సమర్థ అమలు ముఖ్యం. సత్పరిపాలన అవసరం. రాష్ట్ర, పంచాయతీ స్థాయిల్లో సంస్థాపరమైన సామర్థ్యం తక్కువగా ఉంటే విధానాల అమలులో కొన్నిసార్లు లోపాలు ఏర్పడవచ్చు. దీన్ని అధిగమించేందుకు భారత ప్రభుత్వం ఆకాంక్షాత్మక జిల్లాలు, ఆకాంక్షాత్మక బ్లాక్‌ల కార్యక్రమాల (ఏడీపీ/ఏబీపీ) వంటి పరిష్కారాలను ముందుకు తెచ్చింది.

రాష్ట్రాల్లో ఏడీపీ/ఏబీపీల కింద అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న జిల్లాలు, బ్లాక్‌లతో సమానంగా ఎదిగేలా మిగతా జిల్లాలు, బ్లాక్‌లను ప్రోత్సహిస్తారు. ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, నీటి వనరులు, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి వంటి ముఖ్యమైన అంశాలలో ముందడుగు వేసిన జిల్లాలు, బ్లాకులను ఇతరులకు ఆదర్శంగా పరిగణిస్తారు. తద్వారా ఏకకాలంలో పోటీ, సహకారాలను, సమాఖ్యవాదాన్ని పెంపొందిస్తున్నారు. ఇది జీవన సౌలభ్యం, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతోంది. బడ్జెట్ వ్యయాలను అభివృద్ధి ఫలితాలుగా మార్చాలంటే అన్ని విభాగాలు సమన్వయీకృతంగా పని చేయాలనేది ఏడీపీ/ఏబీపీ కార్యక్రమాల నుంచి నేర్చుకున్న ఒక ముఖ్యమైన పాఠం. సాధారణంగా విధానాల అమలు రంగాలు, విభాగాల వారీగా జరుగుతుంది. పర్యవేక్షణ యంత్రాంగాలు వేటికవి విడిగా పని చేస్తాయి. అభివృద్ధి సమాచారం బహుళ విభాగాలు, వివిధ వేదికల్లో చెల్లాచెదురుగా ఉంటుంది. ఇలాంటి విభజిత వాతావరణంలో సమన్వయ చర్యలకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ లోపాన్ని అధిగమించాలి. నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి సాధనకు ప్రత్యేక సంస్థాగత ప్రాతిపదికను నెలకొల్పాలి.

ఏపీ పథకం ఆదర్శనీయం

ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా చేపట్టిన స్వర్ణ పథకం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అది ఎన్నికైన శాసనసభ్యులను ప్రజాప్రయోజక విధానాల అమలులో కీలక పాత్రధారులుగా మారుస్తుంది. తమ నియోజకవర్గంలో ముఖ్యమైన అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి తగిన సంస్థాగత వనరులను ఎమ్మెల్యేలకు అందిస్తుంది. 'స్వర్ణాంధ్ర' 2047 విజన్‌ను వేగంగా సాధించడానికి ఏపీ ప్రభుత్వం స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లను (ఎస్‌సీవీఏపీయూ) ఏర్పాటు చేసింది. ఈ యూనిట్లు ఏపీలోని మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 688 మండలాల్లో ఎన్నికైన ప్రతినిధులకు, పరిపాలనా యంత్రాంగాలకు పలు విధాలుగా మద్దతును అందిస్తాయి. అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో, పనితీరు పర్యవేక్షణ, పౌర భాగస్వామ్యం, కార్యాచరణలలో ఎదురైన లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పాటు ఇస్తాయి. ప్రతి ఎస్‌సీవీఏపీయూ ఎమ్మెల్యే నాయకత్వంలో పని చేస్తుంది. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఒక యువ వృత్తి నిపుణుడు, నాలెడ్జ్ పార్ట్‌నర్, రంగాల వారీ విజన్ సిబ్బందితో కూడిన బృందం సాయంగా ఉంటుంది. ఈ బృందం నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా అంకితమై పనిచేస్తుంది. నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన నుంచి అమలు వరకు పాలుపంచుకుంటుంది. నిడదవోలు వంటి నియోజకవర్గాల అనుభవం ఈ 'స్వర్ణ' నమూనా ప్రయోజనాలను చాటిచెబుతోంది. శాసనసభా నియోజక వర్గాల్లో ఎస్‌సీవీఏపీయూలు భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికీ, అభివృద్ధి ఫలితాల పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికీ, జీవనోపాధిని కల్పించడానికీ, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడానికీ తోడ్పడుతున్నాయి.

ఎస్‌సీవీఏపీయూలు కేవలం డేటా సేకరణకు మాత్రమే పరిమితం కావు. నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి సాధనకు మేధో కేంద్రాలుగా పనిచేస్తాయి. రంగాలవారీగా సమాచారాన్ని క్రమపద్ధతిలో సేకరించి, విశ్లేషించి, దాన్ని ఆచరణాత్మకంగా మలుస్తాయి. సామాజిక-ఆర్థిక పరిస్థితులు, మౌలిక సదుపాయాల పురోగతి, సేవల్లో నాణ్యత, స్థానిక ఆర్థిక కార్యకలాపాల సరళి, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై నిరంతరం నిఘా ఉంచుతాయి. తద్వారా, ప్రతి ఎస్‌సీవీఏపీయూ తన నియోజకవర్గ ప్రజల కోసం జీవనాధారాలను నిర్మిస్తుంది. ముడి సమాచారాన్ని కార్యాచరణకు మార్గనిర్దేశం చేసేలా మలుస్తుంది. తద్వారా నిర్వాహకులు, ఎన్నికైన ప్రతినిధులు సమస్యలు కఠినతరంగా మారడానికి ముందే గుర్తించడానికి, అధికార యంత్రాంగం పనితీరును విశ్లేషించడానికి, అవసరమైనప్పుడు సమర్థంగా జోక్యం చేసుకోవడానికీ తోడ్పడుతుంది. ప్రభుత్వ పథకాలు, విధానాలపై ప్రజా ప్రతిస్పందనను నిర్మాణాత్మకంగా స్వీకరించి, పరిష్కారానికి కృషి చేయడం ఎస్‌సీవీఏపీయూ నమూనా ప్రత్యేక లక్షణం. ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా నమోదైన ఫిర్యాదులు, క్షేత్రస్థాయి తనిఖీలు, భాగస్వాములతో సంప్రదింపులు, సర్వేలు, సమాజంలో పరస్పర చర్చల ద్వారా సేకరించిన అభిప్రాయాలు వంటి వాటన్నింటినీ సమీక్షించి ఎస్‌సీవీఏపీయూలు కార్యాచరణకు దిశానిర్దేశం చేస్తాయి.

పారదర్శక పాలన కోసం...

ఎస్‌సీవీఏపీయూ నమూనా పాలకులు, పాలితుల మధ్య దూరాన్ని తగ్గిస్తుంది. పౌరుల జీవన అనుభవం నుంచి అభివృద్ధి ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయి, పరిపాలనాపరమైన నిర్ణయాలు జరుగుతాయి. పౌరులు ప్రభుత్వ సేవలను పొందడంలో ఎదుర్కొనే ఇబ్బందులను పరిశీలించడం, పౌరులు తమ ప్రాంతాల అభివృద్ధి కోసం వ్యక్తం చేసే ప్రాధాన్యాలను స్వీకరించడం జరుగుతుంది. ఈ విధంగా ఎస్‌సీవీఏపీయూలు పాలనను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దుతాయి. అధికారులను, ప్రజాప్రతినిధులను జవాబుదారీ చేస్తాయి. ప్రజల అవసరాలను తీర్చడానికి వేగంగా స్పందించేలా పురిగొల్పుతాయి. కాలక్రమేణా, ప్రజల నమ్మకాన్ని చూరగొంటాయి. ఎస్‌సీవీఏపీయూలు ప్రభుత్వంలోని వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచుతాయి. ప్రణాళికలు, వాటి పనితీరు గురించి అవి నిర్మాణాత్మకంగా సంప్రదించుకోవడానికి తోడ్పడతాయి. అభివృద్ధి సాధనకు తగిన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. ప్రతి ప్రభుత్వ విభాగం తన సొంత పరిధిలో జవాబుదారీగా వ్యవహరించేలా పురిగొల్పుతాయి. ఇది పౌర-కేంద్రిత వ్యవస్థను సృష్టిస్తుంది. పౌరుల అభివృద్ధి అవసరాలు, ఆకాంక్షలకు ప్రభుత్వం అగ్ర ప్రాధాన్యమిచ్చేలా ఈ వ్యవస్థ చూస్తుంది. విధానానికి, అమలుకు మధ్య వ్యత్యాసాన్ని తగ్గిస్తుంది. వికసిత భారత్ లక్ష్యాలను సాధించడానికి వివిధ రాష్ట్రాల్లో ఇటువంటి పౌర-కేంద్రీకృత వ్యవస్థలు అవసరం. మెరుగైన పాలన, ప్రజల అభివృద్ధి ఆకాంక్షలను సమర్థంగా నెరవేర్చడానికి ఇలాంటి వ్యవస్థలు తోడ్పడతాయి.

# ఇరాన్ యుద్ధం... చైనాకు లాభం!

ఒక యుద్ధం జరిగితే అందులో తలపడే ఏదో ఒక పక్షం విజేతగానో... పరాజితగానో నిలుస్తుంది. తాజా పశ్చిమాసియా యుద్ధంలో మాత్రం ఎక్కడో దూరాన ఉన్న చైనా విజేతగా అవతరించింది. పోరులో భాగస్వాములైన అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌లు మాత్రం నష్టపోయాయి. ఈ యుద్ధం వల్ల ప్రపంచం మొత్తం తీవ్రంగా ఇబ్బందులు పడితే, బీజింగ్ మాత్రం బాగా లబ్ధి పొందింది.ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు తనపై దాడులు మొదలుపెట్టగానే హర్మూజ్ జలసంధిని ఇరాన్ దాదాపుగా మూసేసింది. ప్రపంచ చమురు, గ్యాస్ ఎక్కువగా ఈ మార్గం గుండానే పయనిస్తుంది. హర్మూజ్ స్తంభించడం వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలకు రెక్కలొచ్చాయి. ఆసియాలో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది. ఈ జలసంధి గుండా పయనించే 80శాతం చమురు, 90శాతం ఎల్ఎన్‌జీ ఆసియా మార్కెట్లకే చేరుతుంది. ఆ మార్గంలో రవాణా అయ్యే కీలక సరకుల్లోనూ ఆసియా ఖండానికి గణనీయ వాటా ఉంది. ఈ నేపథ్యంలో ఆసియాలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియాలతో పాటు కొన్ని వర్ధమాన మార్కెట్ల తీరును నిపుణులు విశ్లేషించారు. యుద్ధం కారణంగా తలెత్తిన ఆర్థిక, రాజకీయ సమస్యలు ఆయా దేశాల్లోని తయారీ, ఇంధనం, సాగు సహా కీలక రంగాలపై ఎలా ప్రభావం చూపాయన్నది పరిశీలించారు. ఈ సంక్షోభంలో చైనా అతిపెద్ద లబ్ధిదారుగా అవతరించిందని ఈ సందర్భంగా వెల్లడైంది. యుద్ధం వల్ల



**తలెత్తిన విపరిణామాలను చైనా విజయవంతంగా అధిగమించడమే కాకుండా... దాని కారణంగా ఉత్పన్నమైన ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిస్థితుల నుంచీ లబ్ధి పొందినట్లు అర్థమవుతోంది.**

భారీగా ఇం'ధనం'

చమురు నిల్వలను, పునరుత్పాదక విద్యుత్తును పెంచుకోవడం వల్ల ఇతర దేశాలతో పోలిస్తే చైనాపై ఇంధన పిడుగు పెద్దగా పడలేదు. బీజింగ్ దీర్ఘకాలంగా వ్యూహాత్మక నిల్వలను నిర్వహిస్తోంది. చౌక ధరలను ఆసరాగా చేసుకుని నిరుడు చమురు నిల్వలను భారీగా పెంచుకుంది. కొన్నేళ్లుగా భారీ డిస్కౌంట్లపై ఇరాన్ నుంచి ఆయిల్‌ను కొనుగోలు చేస్తోంది. దీనివల్ల చైనా చమురుశుద్ధి కర్మాగారాలకు ఏటా 400కోట్ల డాలర్లు ఆదా అయినట్లు అంచనా. అదనంగా సమీకరించిన ఆయిల్‌లో 80శాతానికి పైగా నిల్వ కేంద్రాలకు తరలివెళ్లింది. ఈ ఏడాది జనవరి నాటికి 104 రోజులకు సరిపడా చమురు నిల్వలను చైనా కలిగి ఉంది. డ్రాగన్ దేశం కొన్నేళ్లుగా పునరుత్పాదక ఇంధన మౌలికవసతులను పెంచుకుంటోంది. నిరుడు 315 గిగావాట్ల మేర కొత్తగా సౌరవిద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా కొత్తగా వచ్చిన సౌరవిద్యుత్ స్థాపక సామర్థ్యంలో ఇది సగానికంటే ఎక్కువ. అంతకు ముందు సంవత్సరంలో 277 గిగావాట్లను చైనా కొత్తగా అందుబాటులోకి తెచ్చింది. 2030 నాటికి తన ఇంధన అవసరాల్లో దాదాపు సగం మేర శిలాజేతర వనరుల ద్వారా తీర్చుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అందులో పవన, సౌర విద్యుత్ వాటా 30శాతంగా ఉండాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం చైనా ఇంధన అవసరాల్లో 50శాతానికి పైగా బొగ్గు ద్వారానే నెరవేరుతున్నాయి. అయితే పునరుత్పాదకాల వాటా గణనీయంగా పెరుగుతోంది. 1.4 టెరావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ఇప్పటికే సాధించడం, దాదాపు 110 రోజులకు సరిపడా ముడిచమురు నిల్వలు ఉండటం వల్ల యుద్ధ సంక్షోభంతో తలెత్తిన ఇంధన షాక్‌ను మరే ఇతర దేశం కన్నా మెరుగ్గా చైనా ఎదుర్కోగలిగింది.

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో తన శుద్ధ ఇంధన పరికరాల ఉత్పత్తిని చైనా వేగవంతం చేసింది. ప్రపంచ సౌర, పవన విద్యుదుత్పత్తి యంత్రాలు, బ్యాటరీల తయారీ సామర్థ్యంలో చైనా వాటా 80శాతం. ఇటీవలి కాలంలో తన ఉత్పత్తిలో ఎక్కువ భాగాన్ని చౌకగా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తోంది. దీంతో పశ్చిమ దేశాల నేతలు స్థానిక పరిశ్రమల గురించి ఆందోళన చెందుతున్నారు. గతేడాది మేతో పోలిస్తే ఈ సంవత్సరం అదే నెలలో చైనా విద్యుత్ వాహనాల ఎగుమతులు 110శాతానికి పైగా పెరిగాయి. ఏప్రిల్‌లో సౌర విద్యుదుత్పత్తి పరికరాల ఎగుమతిలో 60శాతం మేర వృద్ధి నమోదైంది. పశ్చిమాసియా సమస్యకు పరిష్కారాన్ని కనుగొనే విషయంలో తాను, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఏకతాటిపై ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, ప్రపంచాన్ని అస్థిరపరిచే శక్తిగా అమెరికాపై ముద్రవేయడానికి చైనా ఈ సంక్షోభాన్ని ఉపయోగించుకున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. పశ్చిమాసియాలో అమెరికా రేపిన చిచ్చు వల్ల ప్రపంచం మొత్తం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్న భావనను కలిగించడానికి బీజింగ్ ప్రయత్నించినట్లు పేర్కొంటున్నారు. అదే సమయంలో తనను తాను బాధ్యతాయుత శక్తిగా ప్రచారం చేసుకోవడానికి ఈ యుద్ధం చైనాకు వీలు కల్పించిందని స్పష్టం చేస్తున్నారు.

కీలక సమాచార సేకరణ

పశ్చిమాసియా పోరులో అమెరికా తన సైనిక, ఆర్థిక, వ్యూహాత్మక సంపదను వెచ్చించాల్సి వచ్చింది. దాంతో ఆసియాలో తన ప్రాభవాన్ని బలంగా చాటే సామర్థ్యం అగ్రరాజ్యానికి ఒకింత తగ్గింది. అదే సమయంలో స్వీయ వనరులను చైనా బాగా కాపాడుకోగలిగింది. ప్రపంచ సాంకేతిక నాయకత్వం విషయంలో పెరుగుతున్న పోటీపై దృష్టి సారించింది. దీనికితోడు పశ్చిమాసియా పోరు వల్ల అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోయాయి. అగ్రరాజ్యం తన రేర్ ఎర్త్ మూలకాల అవసరాల్లో 70శాతానికి పైగా చైనాపైనే ఆధారపడుతోంది. ఆయుధ పరిశ్రమల్లో వాడే ఈ కీలక మూలకాల ఎగుమతులపై గట్టి నియంత్రణలు విధించడం ద్వారా అమెరికాను దారిలోకి తెచ్చుకోవడానికి డ్రాగన్ ప్రయత్నిస్తోంది. పశ్చిమాసియా యుద్ధాన్ని చాలా నిశితంగా పరిశీలించడం ద్వారా అమెరికా సైనిక వ్యూహాలు, డ్రోన్ల మోహరింపు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులపై కీలక సమాచారాన్ని చైనా సైన్యం సేకరించగలిగింది. దీనివల్ల భవిష్యత్తులో అమెరికా నేతృత్వంలో మలక్కా జలసంధి దిగ్బంధానికి ప్రయత్నాలు జరిగినా, తైవాన్‌పై ఘర్షణలు చోటుచేసుకున్నా సన్నద్ధం కావడానికి బీజింగ్‌కు అవకాశం ఏర్పడింది.

# డిజిటల్ వేదికల్లో దిగజారుతున్న భాష!

డిజిటల్ విప్లవం సమాచార ప్రపంచాన్ని సమూలంగా మార్చేసింది. ఒకప్పుడు వార్తలను సేకరించి, పరిశీలించి, సంపాదకీయ ప్రమాణాలతో ప్రజల ముందుకు తీసుకువచ్చే బాధ్యత ప్రధానంగా మీడియా సంస్థలదే. కానీ నేడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్, వివిధ సామాజిక మాధ్యమాల ఆవిర్భావంతో చేతిలో స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తీ ఒక ప్రసారకర్తగా మారిపోయాడు. భావ ప్రకటనా స్వేచ్ఛ విస్తరించడం, కొత్త గొంతుకలకు వేదిక లభించడం ప్రజాస్వామ్యానికి సానుకూల పరిణామాలే! కానీ అదే సమయంలో ద్వంద్వార్థాలు, అసభ్య పదజాలం, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు, సంచలనాల కోసం భాషను దిగజార్చడం వంటి ప్రమాదకర ధోరణులు కూడా విస్తృతమయ్యాయి. ఇది ప్రజా చర్చల నాణ్యతను దెబ్బతీస్తున్న సామాజిక పరిణామంగా మారింది.నేటి డిజిటల్ ప్రపంచంలో ప్రధాన పోటీ ప్రజల దృష్టిని ఆకర్షించడానికే పరిమితమైంది. ఏ కంటెంట్ ఎక్కువ మంది చూస్తారు? వీడియోకి ఏ థంబ్‌నెయిల్ ఎక్కువ కోపాన్ని లేదా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది? అనే అంశాలే డిజిటల్ వేదికలు అల్గోరిథమ్‌లను నడిపిస్తున్నాయి. నిజానిజాలు, భాషా సంస్కారం, సామాజిక బాధ్యత కంటే 'ఎంగేజ్‌మెంట్'కు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ఫలితంగా ఎక్కువ వ్యూస్



**కోసం, యాడ్ రెవెన్యూ కోసం కంటెంట్ తయారు చేసేవారు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే భాషను, ద్వంద్వార్థాలను, వ్యక్తిగత విమర్శలను ఆశ్రయిస్తున్నారు. ఈ దృష్టిని ఆకర్షించే పోటీ మధ్య విలువలు లుప్తమవుతున్నాయి.**

అనేక యూట్యూబ్ రాజకీయ చానెళ్లు విధానాల విశ్లేషణ, పాలనా సమీక్ష, రాజ్యాంగ అంశాల చర్చలను పక్కనబెట్టి వ్యక్తుల చుట్టూ రాజకీయాలను కేంద్రీకరిస్తున్నాయి. వ్యక్తిగత దూషణలు, వ్యంగ్యాలు, పరుష పదజాలం, అవమానకర సంభాషణలు సాధారణమైపోయాయి. అత్యంత ఆందోళన కలిగించే అంశం ద్వంద్వార్థ భాష వినియోగం. ఒకప్పుడు కొన్ని వాణిజ్య వినోద కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైన ఈ ధోరణి ఇప్పుడు రాజకీయ వ్యాఖ్యానాల్లోనూ, సామాజిక మాధ్యమాల చర్చల్లోనూ సాధారణమవుతోంది. ప్రత్యక్షంగా అసభ్య పదాలు ఉపయోగించకుండా సంకేతాల రూపంలో, వ్యంగ్యాల రూపంలో, అవమానకర సూచనల రూపంలో వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం కొత్త సంస్కృతిగా మారింది. చట్టపరంగా నేరంగా పరిగణించలేని ఈ భాష కూడా సమాజంలో సంభాషణ ప్రమాణాలను క్రమంగా దిగజారుస్తోంది. పాత్రికేయ దృష్టితో చూస్తే ఇది మరింత ఆందోళనకర పరిణామం. సంప్రదాయ జర్నలిజం వాస్తవ నిర్ధారణ, సందర్భానుసార విశ్లేషణ, భాషా సంస్కారం, సంపాదకీయ బాధ్యత వంటి ప్రమాణాలపై నిర్మితమైంది. డిజిటల్ మీడియా సమాచార ప్రజాస్వామ్యాన్ని విస్తరించినప్పటికీ, సంపాదకీయ పర్యవేక్షణను గణనీయంగా తగ్గించింది. అనేక స్వతంత్ర యూట్యూబ్ చానెళ్లకు సంస్థాగత బాధ్యత లేదు. ఫలితంగా వాస్తవ నిర్ధారణ స్థానంలో వేగం, విశ్లేషణ స్థానంలో అభిప్రాయం, ఆధారాల స్థానంలో ఉద్వేగం చోటుచేసుకుంటున్నాయి.

భాష దిగజారడం ఒక్కటే సమస్య కాదు. సంచలన శీర్షికలు, తప్పుదోవ పట్టించే థంబ్‌నెయిల్స్, సందర్భం లేకుండా కత్తిరించిన వీడియోలు, ఏకపక్ష రాజకీయ వ్యాఖ్యానాలు ప్రజల అవగాహనను కూడా వక్రీకరిస్తున్నాయి. సంక్లిష్ట రాజకీయ అంశాలను ఆలోచించి విశ్లేషించాల్సిన చోట ప్రేక్షకులను తక్షణ భావోద్వేగ ప్రతిస్పందనల వైపు నెడుతున్నాయి. ఫలితంగా ప్రజాస్వామ్యంలో అవసరమైన హేతుబద్ధ చర్చలకు బదులుగా విభజన, పరస్పర ద్వేషం పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితిని సరిదిద్దడానికి బహుముఖ చర్యలు అవసరం. మొదటగా- డిజిటల్ వేదికలు కేవలం వ్యూస్ ఆధారంగా కాకుండా కంటెంట్ నాణ్యత, విశ్వసనీయతకు కూడా ప్రాధాన్యం ఇచ్చే విధంగా తమ అల్గోరిథమ్‌లను మార్పు చేయాలి. ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థలతో కలిసి పనిచేస్తూ, అసభ్య, విద్వేషపూరిత భాషను ప్రోత్సహించే చానెళ్లపై చర్యలు తీసుకోవాలి. రెండవది- ప్రభుత్వాలు నియంత్రణ పేరుతో భావ ప్రకటనా స్వేచ్ఛను పరిమితం చేయకుండా డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించాలి. వార్త, అభిప్రాయం, వ్యంగ్యం, దుష్ప్రచారం మధ్య తేడాను గుర్తించే సామర్థ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలి. విద్యా వ్యవస్థలో మీడియా లిటరసీని ఒక ముఖ్యమైన అంశంగా చేర్చాలి. మూడవది- పాత్రికేయ రంగం తన మూల విలువలను మరింత బలోపేతం చేసుకోవాలి. వివరణాత్మక కథనాలు, గణాంకాల ఆధారిత విశ్లేషణలు, నిర్మాణాత్మక రాజకీయ చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సోషల్ మీడియా సంచలనాన్ని అనుకరించడం ద్వారా మీడియా విశ్వసనీయతను కోల్పోకూడదు. జర్నలిజం అసలైన బలం వేగంలో కాదు; విశ్వసనీయతలో ఉంది.

అలాగే పౌరసమాజ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, మీడియా సంఘాలు కలిసి డిజిటల్ సంభాషణకు స్వచ్ఛంద నైతిక నియమావళిని రూపొందించాలి. బాధ్యతాయుతమైన డిజిటల్ జర్నలిజాన్ని ప్రోత్సహించే పురస్కారాలు, ప్రోత్సాహకాలు కూడా ఈ దిశగా ఉపకరిస్తాయి.

భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. అయితే స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా అంతే ముఖ్యమైనది. అసభ్యతను సహజంగా అంగీకరించకుండా సంభాషణలో సంస్కారం, వాస్తవికత, పరస్పర గౌరవం నిలబెట్టడం కాలానుగుణ అవసరం. ప్రజాస్వామ్యం బలపడేది భిన్నాభిప్రాయాల వల్ల మాత్రమే కాదు; ఆ భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించే భాష నాణ్యత వల్ల కూడా.

# పరిమితికి మించితే ప్రమాదమే!

అంతర్జాతీయంగా శాంతి నెలకొన్నప్పుడు స్థానిక అవసరాలకు దిగుమతులపై ఆధారపడటంలో ఇబ్బందేమీ అనిపించదు. దేశాల నడుమ వివాదాలు ఎడతెగని యుద్ధాలకు దారితీసినప్పుడు మాత్రం సరఫరా గొలుసుల్లో స్థిరత్వానికి భరోసా ఉండదు. రావణకాష్ఠంగా రగులుతున్న పశ్చిమాసియా సంక్షోభం ఇప్పుడు అదే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. గల్ఫ్ నుంచి ముడిచమురు, గ్యాస్, ఎరువులను అధికంగా తెప్పించుకునే ఇండియా వంటి దేశాలపైనైతే యుద్ధ విపరిణామాల ప్రభావం తీవ్రంగా ఉంది. జనాభాలో దాదాపు సగం మందికి జీవనాధారమైన వ్యవసాయ రంగం ఇలాంటి విపత్తుల మూలంగా అనిశ్చితిలోకి జారిపోకూడదనే కేంద్రం 2012లో యూరియాకు సంబంధించి కొత్త పెట్టుబడి విధానాన్ని(ఎన్ఐపీ) ప్రకటించింది. నత్రజని ఎరువులో స్వావలంబన సాధించాలని



**సంకల్పించింది. 'ఎన్ఐపీ' కింద ఆరు కొత్త ప్లాంట్లు ప్రారంభం కావడంతో 2014-15లో 225 లక్షల మెట్రిక్ టన్నులు(ఎల్ఎంటీలు)గా నమోదైన దేశీయ యూరియా ఉత్పత్తి... 2024-25లో 306 ఎల్ఎంటీలకు పెరిగింది. కానీ, విచ్చలవిడి వాడకంతో ఏడాదికి అయిదుశాతం చొప్పున యూరియాకు గిరాకీ ఎక్కువవుతుండటంతో ఇప్పటికీ దిగుమతులపై భారీగా ఖర్చుచేయక తప్పట్లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రిమండలి తాజాగా ఆమోదించిన ఎన్ఐపీ-2026, యూరియాకోసం విదేశాల వైపు చూసే అగత్యాన్ని గణనీయంగా తగ్గించగలదు!**

దిగుబడులు బాగా వస్తాయనే ఆశతో భారతీయ రైతాంగం పొలాల్లో నత్రజని ఎరువును విపరీతంగా చల్లేస్తోంది. దాంతో 201415లో దాదాపు 309 ఎల్ఎంటీలుగా ఉన్న యూరియా వినియోగం, 2024 25కు వచ్చేసరికి 385 ఎల్ఎంటీలకు పైబడింది. ఆ మేరకు దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యం పెరగకపోవడంతో 202325 మధ్యలో దాని దిగుమతులకోసమే రూ.49వేల కోట్లకుపైగా ధారబోయాల్సి వచ్చింది. ఈ ఆర్థిక భారాన్ని పశ్చిమాసియా యుద్ధం మరింతగా పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్ఐపీ2026 కింద కోటి టన్నుల సామర్థ్యం కలిగిన 89 గ్యాస్ ఆధారిత యూరియా ప్లాంట్లను నిర్మించాలని కేంద్రం తలపోస్తోంది. అనుకున్నట్లుగా అవి అందుబాటులోకి వస్తే ఆహారభద్రతతోపాటు ఉపాధికల్పన పరంగానూ జనభారతానికి మేలు జరుగుతుంది. అయితే, ప్రస్తుతం దేశీయంగా యూరియా ఉత్పత్తికి అవసరమైన గ్యాస్‌లో మూడొంతులకు పైగా దిగుమతులే దిక్కవుతున్నాయి. ప్రతిపాదిత ప్లాంట్లు ఉనికిలోకి వస్తే సహజవాయువు అవసరాలు ఇంకా అధికమవుతాయి. గ్యాస్ సరఫరాల్లో సమస్యలు తలెత్తకుండా చూస్తూనే, యూరియాను మితిమీరి వినియోగించడం అనర్థదాయకమని రైతులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం చురుగ్గా వ్యవహరించాలి!

యూరియాను పరిమితికి మించి వాడితే తలెత్తే దుష్ఫలితాలను ఐరాస శాస్త్రవేత్తల బృందం ఇటీవలే నివేదించింది. దానివల్ల నేల ఆరోగ్యం క్షీణించడమే కాదు రసాయన అవశేషాలు కలిగిన పంట ఉత్పత్తుల వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందని పేర్కొంది. సంతానలేమి సమస్యలూ ముమ్మరిస్తాయని ఆ బృందం హెచ్చరించింది. కానీ, మన దగ్గర శాస్త్రీయ సిఫార్సులను పట్టించుకోకుండా 50100శాతం ఎక్కువ యూరియాను గుమ్మరిస్తున్నట్లు అంచనా! దానివల్ల భూమి చౌడుబారడంతో పాటు జలకాలుష్యమూ అధికమవుతోంది. కాబట్టి సాగు నిపుణులు, నీతిఆయోగ్ సూచిస్తున్నట్లుగా సర్కారీ రాయితీ విధానాలు కేవలం ఎరువుల వాడకాన్ని పెంచడానికి కాదు, నేలకు సరైన పోషకాలు సమపాళ్లలో అందడానికి ఉపయుక్తం కావాలి. ఆరోగ్యకర మార్గాల్లో పంట దిగుబడుల వృద్ధికి అవి దోహదపడాలి.

# ఆంధ్రప్రదేశ్‌లో 'బుద్ధిస్ట్ సర్క్యూట్' ఏర్పాటుకు కృషి



- మంత్రి కందుల దుర్గేష్
- ఉండ్రాజవరంలో తొలిసారిగా నిర్మించిన 'మైత్రేయ బుద్ధ విహార్' ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దుర్గేష్
- బుద్ధుని బోధనలు అజరామరం అని పేర్కొన్న మంత్రి దుర్గేష్

**నిడదవోలు జూలై 29, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బౌద్ధ క్షేత్రాల సమగ్ర అభివృద్ధికి, 'బుద్ధిస్ట్ సర్క్యూట్' ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్మించిన 'మైత్రేయ బుద్ధ విహార్' ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని గౌతమ బుద్ధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ దమ్మ పీఠాధిపతి బంతె అనాలయో, శ్రీలంక నుంచి విచ్చేసిన డాక్టర్ బోధగామ చండిమా నాయకే థేరోల ఆశీస్సులు స్వీకరించిన మంత్రి దుర్గేష్ పలు దేశాల నుంచి విచ్చేసిన బౌద్ధ ప్రతినిధులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..బుద్ధుడు సంచరించిన పవిత్ర ప్రాంతంగా నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరానికి గుర్తింపు ఉందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో పర్యాటక శాఖను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, యువత మరియు విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించేలా ఈ విహార్ తోడ్పడాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. మైత్రేయ బుద్ధ విహార్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా, విశ్వవ్యాప్తం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉత్తర భారతదేశం తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని తొట్లకొండ, బావికొండ, ఆదుర్రు, ఉండ్రాజవరం, అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల వంటి ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను అనుసంధానిస్తూ త్వరలోనే బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. శాంతి, సహనం, అహింస అనేవి ఏ కాలానికైనా ఆచరణీయమైనవని, ద్వేషాన్ని ప్రేమతోనే జయించగలమన్న బుద్ధుని సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వంటి ఎందరో మహనీయులు కూడా ఈ మార్గాన్ని అనుసరించారని గుర్తుచేశారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో ప్రధాని పర్యటన ఉండటంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు రాలేకపోయారని స్పష్టం చేశారు.

# విద్యార్థులను ప్రోత్సహించేందుకు కానుకగా సైకిల్ అందిస్తున్నాం..

- ఎమ్మెల్యే అమిలినేని
- వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థను నాశనం చేశారు..
- అందరికి అమ్మవడి అని ఒక్కరికి ఇచ్చి నమ్మక ద్రోహం చేశారు..
- కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా ఒక ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అందరికీ తల్లికివందనం అందించాం
- రెండవ రోజు గ్రామీణ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే
- ఎస్సార్సీ సంస్థ తరుపున ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు 5కోట్ల రూపాయల ఖర్చుతో 7300 సైకిళ్లు పంపిణీ

**కళ్యాణదుర్గం జూలై 29, అనంత జనశక్తి న్యూస్**




విద్యార్థులను విద్యకు ప్రాధాన్యత ఇచ్చేలా వారికి మరింత ప్రోత్సాహం అందించడం కోసం గ్రామీణ ప్రాంత విద్యార్థులు 9,10, ఇంటర్ విద్యార్థులకు కానుకగా సైకిళ్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పేర్కొన్నారు..నేడు రెండవ రోజు గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహక కానుకగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు అందిస్తున్న సైకిళ్ల పంపిణీ మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా
టీడీపీ సీనియర్ నాయకులు చౌలం మల్లికార్జున, కరణం రామ్మోహన్ చౌదరి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కర్లకుంట రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు బీకే గోవిందప్ప, తలారి సోము, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని శ్రీనివాస రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మాదినేని మురళి, పార్లమెంట్ కార్యదర్శి షామీర్, సింగిల్ విండో చైర్మన్ మల్లిపల్లి నారాయణ, ఊటంకి రామాంజనేయులు, మండల, స్థానిక టీడీపీ నాయకులు ఎమ్ఈఓలు విజయకుమారి, బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో కలసితో కలసి పాల్గొని సైకిళ్లు విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అందరికి అమ్మవడి అని చెప్పి తీరా అందించే సమయానికి ఒక్క ఇంట్లో ఒక్కరికే ఇచ్చి వారి చదువులను తుంగలో తొక్కాడన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లిదండ్రుల బాధలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికి తల్లికివందనం అందిస్తామని హామీ ఇచ్చి నేడు ప్రతి తల్లి ఖాతాకు జమ చేసి నిబద్ధత చాటుకున్నారని తెలిపారు..అంతే కాకుండా గతంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసి ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద ఉంచారని అన్నారు..ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వారికి అనవసరపు పనులకు కేటాయించకుండా చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించి వారి బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలవాలన్నారు..రెండు నెలల్లో విద్యార్థులకు ఆదుకునేందుకు వీలుగా గ్రౌండ్ ను మట్టి తోలించి చదును చేస్తామని హామీ ఇచ్చారు..

# క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి...

- క్రీడాపోటీలనుప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

**అనంతపురం, జూలై 29:అనంత జనశక్తి న్యూస్**



గ్రామీణ ప్రాంతాల్లోదాగిఉన్న క్రీడాప్రతిభనువెలికితీసి రాష్ట్ర, జాతీయ అంతర్జా తీయ స్థాయిలో రాణించే విధంగాక్రీడాకారులను తీర్చిది ద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని,ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్నక్రీడాఅవకాశాలను సద్వినియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు.బుధవారం ఉదయం అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు జడ్పీ హైస్కూల్ లో అనంతపురం రూరల్ మండలం స్థాయి బాల బాలికలకు అమరావతి ఛాంపియన్షిప్ 2026 క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్
ఓ. ఆనంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసమావేశంలోపాల్గొన్న జిల్లా కలెక్టర్ తొలుత క్రీడల్లో పాల్గొన్న బాల బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్నిపెంపొందించాలన్న ధ్యేయంతో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరావతి ఛాంపియన్షిప్ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలలో జిల్లా వ్యాప్తంగా ఎంతోఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. బాల బాలికలు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తద్వారా ప్రతిభకు కొదవ ఉండదని ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న అవకాశాలు, శిక్షణ ప్రోత్సాహంనుఉపయోగించుకోవాలన్నారు.ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే బాల బాలికలు ఆయా క్రీడల్లోమంచిప్రతిభపటవాలు ప్రదర్శించి జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించి ఆయా పాఠశా లలకు, జిల్లాకు మంచి పేరు తీసుకొని వచ్చే విధంగా కృషి చేయాలి అన్నారు. క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం పెరుగు
తుందన్నారు. క్రమశిక్షణ తో విద్యాభ్యాసం పూర్తి చేసి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఉన్నత శిఖరాలను అధిరోహిం
చాలని జిల్లా కలెక్టర్ సూచిం చారు. క్రీడాకారుల తోపాటు క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అనంతపురంమండలంలోని 12 పాఠశాలల నుంచి బాల బాలికలు 500 మంది దాకా రెండు రోజులు పాటు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ గౌరవ జిల్లా కలెక్టర్ వారి ప్రోత్సాహంతో ప్రస్తుత జడ్పీ హైస్కూల్ లో ఉన్న ప్లే ఫీల్డ్ మైదానాన్ని అన్ని విధాల తీర్చిదిద్దడం జరిగిందని జిల్లా విద్యాశాఖ ఆర్డిటి మరియుజిల్లాక్రీడాఅభివృద్ధి సంస్థలసంయుక్తసౌజన్యంతో ఈ అనంతపురం గేమ్స్ అండ్ స్పోర్ట్స్ చాంపియన్షిప్ పోటీలు నిర్వహించబడుతున్నాయని రెండు రోజులు పాటు రూరల్ క్రీడా పోటీలు జరగనున్నట్లు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మండల స్థాయిలో నిర్వహించబ డుతున్న అండర్ 14 బాలురు మరియు బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ ,కోకో, అథ్లెటిక్స్ పోటీల వివరాలను జిల్లా క్రీడ అభివృద్ధి అధికారి ద్వారా అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్
వాలీబాల్ క్రీడ ను ప్రారం భించి బాల బాలికలను ఎంతో ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ ను కలిసి తమ పాఠశాలను అన్ని విధాల తీర్చిదిద్దాలని అలాగే వ్యవసాయ పంటల రైతులకు వర్షపు నీటిని అందించే విధంగా జలధార కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ పై తెలిపిన అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల, ఎంపీడీవో దివాకర్ , ఆర్ ఐ సందీప్, సింగల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ, హెడ్మాస్టర్ విశ్వనాథ్ , ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి పలువురు గ్రామ పెద్దలు నాయకులు పాఠశాలల ఉపాధ్యా యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కరవు పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు బిసి సంక్షేమ,చేనేత శాఖ మంత్రి ఆదేశం
- జిల్లాలో తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- సమీక్షా సమావేశంలో పాల్గొన్న బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యేలు కందికుంట వెంకట ప్రసాద్, పల్లే సింధూర రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి.

**పుట్టపర్తి జూలై 29:అనంత జనశక్తి న్యూస్**




ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు కరవు నివారణ చర్యలు, తాగునీటి సరఫరా, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సంసిద్ధతపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్ ,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లే సింధూర రెడ్డి , కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్,ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ... ఎల్‌నినో కరవు పరిస్థితుల ఎదుర్కొనానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి.సూపర్ ఎల్‌నినో కరవు ప్రభావంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.మంత్రి సవిత అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రణాళికతో కరవు పరిస్థితులను ఎదుర్కోవాలి.జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా గ్రామీణ మంచి నీటి సరఫరా (RWS) అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి. సమస్యాత్మక గ్రామాలను ముందే గుర్తించి, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి. చేతిపంపుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.కరవు కాలంలో మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి కొరత లేకుండా చూసేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు సైలేజ్, ఎండుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి.పశుగ్రాస క్షేత్రాల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలి.ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద కూలీలకు క్రమం తప్పకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నిరోధించేలా ఉపాధి పనులను వేగవంతం చేయాలని, సమయానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో ప్రతివారం గ్రామస్థాయి పరిస్థితులను సమీక్షించుకోవాలి. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత లేదా కరవు పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం మరియు గౌరవ మంత్రివర్యుల ఆదేశాల మేరకు సమగ్ర ప్రణాళికను రూపొందించాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై నిరంతరం సమీక్షిస్తున్నాం. ఎండ తీవ్రత, భూగర్భ జలాల మట్టాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించాం. బోర్ల రీబోరింగ్, పైప్‌లైన్ మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేస్తున్నాం.అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు సిద్ధం చేశాం. కరవు ఉపశమన చర్యల్లో భాగంగా రైతులకు ఉపాధి హామీ పనులు, మూగజీవాలకు పశుగ్రాసం కొరత రాకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నాం.ఈ సమావేశంలో జిల్లా వివిధ శాఖల అధికారులు, డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# యోగా గురువుకు సన్మానం.



- గురు పౌర్ణమి సందర్భంగా యోగా గురువు కరెంటు ఆదికి సన్మాన కార్యక్రమం.
- టిడిపి యువ నాయకుడు, చేనేత ప్రముఖుడు సంధా రాఘవ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

**ధర్మవరం జులై 29, అనంత జనశక్తి న్యూస్:**

గురు పౌర్ణమి సందర్భంగా యోగా గురువు కరెంట్ ఆదికి ఘనంగా సన్మానం నిర్వహించారు. టిడిపి యువ నాయకుడు, చేనేత ప్రముఖుడు సంధా రాఘవ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సంధా రాఘవ మాట్లాడుతూ.... గురువు సమాజానికి దిశా నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. యోగా ద్వారా ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు కరెంటు ఆది చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. గురు పౌర్ణమి రోజున గురువును సన్మానించుట, గౌరవించడం భారతీయ సంస్కృతికి ప్రతీక అన్నారు. అనంతరం యోగా గురువు కరెంట్ ఆది మాట్లాడుతూ... తనపై చూపిన గౌరవానికి సంధా రాఘవ తో పాటు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. యోగా ద్వారా మరింత మందికి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అందించే దిశగా తన సేవలను కొనసాగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షణార్థులు టిడిపి యువ నాయకులు, చేనేత ప్రముఖులు సంధా రాఘవ తో పాటు జింకా పురుషోత్తం, సంధా రవీంద్ర, చందు, జనార్ధన్, నర్సి, జిలకర శీన, హరి, తిరుమలేశు, వెంకటేశులు, చంద్రమౌళి, అనిల్ పాల్గొని గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉచిత ఊపిరితిత్తులు, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు.




- మొబైల్ హ్యాండిల్ ఎక్స్రే ద్వారా ఉచిత ఊపిరితిత్తులు, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు.
- చేనేత ప్రముఖులు, టిడిపి యువ నాయకులు సంధా రాఘవ, రవీంద్ర ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలు.

**ధర్మవరం జులై 29, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలో మొబైల్ హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే యంత్రం ద్వారా ఊపిరితిత్తుల క్షయవ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో మొత్తం 120 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక సేవకులు సంధా రాఘవ, రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించగా, డాక్టర్ ప్రియాంక సమక్షంలో వైద్య బృందం ప్రజలకు క్షయవ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు, చికిత్స ప్రాముఖ్యతపై అవగాహన కల్పించింది. మొబైల్ డిజిటల్ ఎక్స్‌రే సదుపాయం ద్వారా అనుమానితులకు వెంటనే ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.... క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, ప్రజలు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించేందుకు కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, మరియు ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు మరియు క్షయ వ్యాధి విభాగం సూపర్వైజర్స్ ఎరుకులప్ప, నాగేంద్ర, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలు



**ధర్మవరం జూలై 29, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్ లో గల సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలు శ్రీ షిరిడి సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి అర్చకు లు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం వివిధ పూల మాలలతో అలంకరించిన వైనం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆనవా యితీగా వస్తున్న పాద దర్శనముకు కూడా కమిటీ సభ్యులు అవకాశం కల్పించ డంతో భక్తాదులు బారులు తీరారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. తదుపరి డిఎస్పి, సిఐలు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదానమునకు దాదాపు 15,000 మందికి దాక భక్తాదులు పాల్గొన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డి.ఎస్.పి ఆధ్వర్యంలో ఆలయముకు పోలీస్ భద్రత కూడా కల్పించడం జరిగింది. జులై 30వ తేదీన గ్రామోత్సవం కార్యక్రమం కూడా ఉంటుందని కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షులు రాంప్రసాద్, కార్యదర్శి కృష్ణమూర్తి, ఉప కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి శ్రీనివాసరావు తో పాటు పాత కమిటీ వారు, సేవాకర్తలు, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం
30.07.2026
ANDHRA PRADESH NEWS ఆంధ్రప్రదేశ్ న్యూస్

- రైలు పరుగులు.... సమస్యలు పరుగు లే...!
- రెండో ప్లాట్ ఫారం.... రెండింతల కష్టాలు.
- కోట్లతో స్టేషన్ ముస్తాబు చేశారు.... లిఫ్ట్ మాత్రం మరిచారు.
- అభివృద్ధి మాటల్లోనే... స్టేషన్లో అవస్థలే...?
- ఆధునీకరణ చేసినారు.... ఆటో స్టాండ్ మరిచారు.
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కలేక వృద్ధుల, వికలాంగులు, గర్భిణీలు, అనా రోగులు, మోకాలు నొప్పుల వారి అవస్థలు...
- ప్రయాణికుల పాలిట రైల్వే స్టేషన్ శిక్షాగారమా?
- తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు నాలుగో నెంబర్ ప్లాట్ఫారం లో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి.
- టికెట్ నుంచి ప్లాట్ఫారం వరకు తిప్పలే... తిప్పలు.
-అధికారులు స్పందించేది ఎప్పుడూ?

# రైలు సమస్యలు.... రైలు పరుగులు...!!






**ధర్మవరం జులై 29, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల ఇబ్బందులు రోజు...రోజుకూ పెరుగుతున్నాయి. నిత్యం వేలాదిమంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రధాన జంక్షన్. కానీ ప్రయాణికుల సౌకర్యాల విషయంలో మాత్రం పరిస్థితి ఆశాజనకంగా కనిపించడం లేదు. ముఖ్యంగా ఎక్స్ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను 2 నెంబర్ ప్లాట్ ఫారం పైకి తీసుకురావడం వల్ల వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు. ప్రయాణికుల సౌకర్యం కంటే నిర్వహణకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైలు రెండో ప్లాట్ ఫారం పైకి వస్తే ప్రయాణికులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కి దిగాల్సిందే. చేతిలో భారీ లగేజీ, ఒడిలో చిన్నారులు, వెంట వృద్ధులు ఉంటే పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. రైలు బయలుదేరే సమయం దగ్గరపడుతుండటంతో పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదాల భయం కూడా వెంటాడుతోంది. అలాంటి సంఘటనను కూడా గతంలో జరిగాయి.వృద్ధులు మెట్లు ఎక్కలేక మధ్యలోనే ఆగిపోతుంటే, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్నవారు, చిన్నారులతో ప్రయాణించే మహిళలు ప్రతి ప్రయాణాన్ని ఒక పరీక్షలా..... ఎదుర్కొంటున్నారు. లగేజీ మోసే సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.కొంతమంది ప్రయాణికులు సమయం ఆదా చేసేందుకు నిబంధనలకు విరుద్ధంగా రైల్వే పట్టాలు దాటే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. ఒకవైపు అవగాహన కల్పిస్తున్న రైల్వే శాఖ, మరోవైపు ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం వెనుక బడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ధర్మవరం వంటి ప్రధాన జంక్షన్‌లో ఎస్కలేటర్లు, లిఫ్టులు, మరిన్ని ప్రయాణికుల సౌకర్యాలు అత్యవసరమని ప్రజలు కోరుతున్నారు.

**అభివృద్ధి చేశారు.... లిఫ్టును మరిచారు...!**

మెరిసే స్టేషన్... కానీ ప్రయాణికుల కష్టాలకు పరిష్కారం ఎక్కడ? వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలకు ప్రతి ప్రయాణం ఒక పరీక్ష... సౌకర్యాలు లేక అభివృద్ధి మాటలకే పరిమితమా? ధర్మవరం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. కొత్త నిర్మాణాలు, ఆధునికీకరణ, అందమైన భవనాలు.... అన్ని కనిపిస్తున్నాయి. కానీ అస్సలు అవసరమైన ప్రయాణికుల సౌకర్యాల విషయానికి వస్తే మాత్రం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రెండో నెంబర్ ప్లాట్ఫారం పైకి రైలు వస్తున్నా, ప్రయాణికుల కోసం లిఫ్ట్ వంటి ప్రాథమిక సౌకర్యం లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు, చిన్నారులతో వచ్చే మహిళలు భారీ లగేజ్ తో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్లు ఎక్కి దిగాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కో మెట్టు వారికి భారీగా నరకయాతన కనిపిస్తోంది. స్టేషన్ అభివృద్ధి అంటే భవనాలు కట్టడమేనా? లేక ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి."గోడలు రంగురంగులుగా మారాయి... కానీ ప్రయాణికుల కష్టాలు మాత్రం రంగులు మార్చలేదు."అనే వ్యాఖ్యలు రైలు ప్రయాణికులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. రైల్వే శాఖ కోట్ల రూపాయలు వెచ్చించి స్టేషన్ను ఆధునికీకరించినా, ఒక లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఆలోచన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అభివృద్ధి ఫలాలు ప్రయాణికులకు అందకపోతే ఆ అభివృద్ధికి అర్థమేంటని రైలు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రైలు వచ్చే సమయానికి మెట్లు ఎక్కలేక వృద్ధులు ఆగిపోతుంటే, వికలాంగులు ఇతరుల సహాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గర్భిణీలు, చిన్నారులతో ఉన్న తల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి దృశ్యాలు నిత్యకృతంగా మారినా అధికారుల స్పందన కనిపించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తిరుపతి ప్రయాణికులకు తిప్పలు....!**

తిరుపతి కి వెళ్లే(4వ నెంబర్) ప్లాట్ఫారం లో టికెట్ కౌంటర్ లేదు.... టికెట్ కోసం ఒక ప్లాట్ఫారం నుంచి మరో ఫ్లాట్ ఫారానికి పరుగులు.... రైలు మిస్సవుతోందనే ఆందోళన, ప్రయాణికుల సౌకర్యాలు పెంచాల్సిన చోట... సమస్యలు పెరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధర్మవరం రైల్వే స్టేషన్ లో తిరుపతికి వెళ్లే రైళ్లు తరచూ నాలుగో నెంబర్ ప్లాట్ఫారం పైకి వస్తున్నప్పటికీ, అక్కడ టికెట్ కౌంటర్ లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైలు వచ్చే సమయానికి టికెట్ కోసం మరో ప్లాట్ఫారానికి వెళ్లి తిరిగి రావలసిన పరిస్థితి ఏర్పడుతోంది. టికెట్ కొనుగోలు చేయాలంటే ప్రయాణికులు ఫుడ్ పవర్ బ్రిడ్జి ఎక్కి దిగాల్సి వస్తోంది. చేతిలో సామాన్లు, వెంట చిన్నారులు, వృద్ధులు ఉంటే ఈ ప్రయాణం మరింత కష్టంగా మారుతోంది. టికెట్ తీసుకొని తిరిగి నాలుగో ఫ్లాట్ఫారానికి చేరుకునే లోపే రైలు బయలుదేరి పోతుందేమోనన్న ఆందోళన ప్రయాణికులను వెంటాడుతోంది. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన రైల్వే శాఖ ప్రయాణికుల అవసరాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి ."రైలు నాలుగో ఫ్లాట్ ఫారం పైకి వస్తోంది... కానీ టికెట్ మాత్రం మరో ఫ్లాట్ ఫారం పై తీసుకోవాలా? అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ధర్మవరం వంటి ప్రధాన రైల్వే జంక్షన్ లో నాలుగో నెంబర్ ఫ్లాట్ఫారం పై టికెట్ కౌంటర్ లేకపోవడం ఆశ్చర్యకరమని స్థానికులు అంటున్నారు. ఆధునికీకరణ పేరుతో పనులు చేపడుతున్న అధికారులు ప్రయాణికులకు అత్యవసరమైన సౌకర్యాలను మాత్రం విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో నెంబర్ ఫ్లాట్ఫారం పై శాశ్వత టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని లేకపోతే ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్ ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

**ఉప్ప నీరే త్రాగునీరా...!**

ధర్మవరం రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల దాహానికి ఇదే సమాధానమా? కోట్ల రూపాయలతో స్టేషన్ అభివృద్ధి పనులు... ఆధునిక హంగులు... కొత్త భవనాలు అందమైన ఫ్లాట్ఫారాలు... ఇవన్నీ ఒక వైపు. కానీ ప్రయాణికుడు దాహం తీర్చుకోవడానికి కులాయి తిప్పితే వచ్చేది ఉప్పు నీరే. ఆ అభివృద్ధికి అర్థమేంటి? ధర్మవరం రైల్వే స్టేషన్ రాష్ట్రంలోనే అత్యంత రద్దీ జంక్షన్లో ఒకటి. రోజు వేలాదిమంది ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణిస్తుంటారు. అలాంటి స్టేషన్లో త్రాగడానికి పనికిరాని నీరు అందడం కేవలం ఒక లోపం కాదు... ఇది ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనం. రైల్వే శాఖ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోంది. అమృత్ భారత్ పేరుతో కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని ప్రచారం చేస్తోంది. కానీ ప్రయాణికుడు ప్రాథమిక అవసరమైన స్వచ్ఛమైన త్రాగునీటిని అందించ లేకపోతే ఆ ప్రచారాన్ని కాగితాలకి పరిమితమవుతాయి.

గోడలకు రంగులు వేయడం కంటే కులాల్లో మంచినీరు రావటం ముఖ్యం. స్టేషన్లో త్రాగునీరు ఉప్పుగా వస్తోందని ప్రయాణికులు ఎన్నోసార్లు వాపోయినా సంబంధిత అధికారులు స్పందించ లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అధికారులు ఎప్పుడైనా ఈ నీటిని తాగి చూశారా? ఒక్కసారైనా ప్రయాణికుడి స్థానంలో నిలబడి ఆ బాధను అర్థం చేసుకున్నారా? అనే ప్రశ్నలు సమాధానంగానే తలెత్తుతున్నాయి. ప్రయాణికులు బాటిల్ నీరు కొనుగోలు చేసే స్థోమత లేకపోతే పరిస్థితి ఏమిటి? పేదలు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు దాహంతో ఇబ్బంది పడాల్సిందేనా? ప్రజల అవసరాన్ని ఆదాయ వనరులుగా మార్చే పరిస్థితి ఎందుకు రావాలి? రైల్వే శాఖ వెంటనే త్రాగునీటి నాణ్యత పై సమగ్ర పరీక్షలు నిర్వహించాలి. అవసరమైతే ఆధునిక ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రతి ఫ్లాట్ఫారంపై స్వచ్ఛమైన త్రాగు నీటిని అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రైల్వే అధికారులారా.... సమస్యలపై దృష్టి పెట్టండి....!

**నిర్లక్ష్యం వీడండి.... ప్రయాణికుల కష్టాలను గుర్తించండి. అభివృద్ధి మాటల్లో కాదు.... కనిపించాలి. రైల్వే స్టేషన్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఒక్కరోజు పుట్టినవి కావు. రెండో నెంబర్ ప్లాట్ఫారంపై రైళ్లు రావడంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు పడుతున్న ఇబ్బందులు... నాలుగో నెంబర్ ప్లాట్ఫారంపై టికెట్ కౌంటర్ లేక తిరుపతి ప్రయాణికులు పడుతున్న అవస్థలు.... లిఫ్ట్, ఎస్కలేటర్ వంటి కనీస సౌకర్యాల కొరత.... ఇవన్నీ ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యలే, అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యాలు రైల్వే శాఖకు మొదటి ప్రాధాన్యత కావాలి. కానీ క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న దృశ్యాలు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. చేతిలో సామాన్లు, ఒడిలో చిన్నారులు, వెంట వృద్దులతో మెట్లు ఎక్కి దిగుతున్న ప్రయాణికుల కష్టాలు అధికారులకు కనిపించలేదా? అని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాలు నిర్మించడం అభివృద్ధి కాదు... ప్రయాణికుల ఇబ్బందులను తొలగించడమే నిజమైన అభివృద్ధి. స్టేషన్ను ఆధునీకరణ చేశామని చెప్పకోవడం సరికాదు. ఆధునీకరణ వల్ల ప్రయాణికులకు ఉపయోగం లేకపోతే అది కేవలం ప్రదర్శనగానే మిగిలిపోతుంది. ప్రజలకు అవసరాలను పట్టించుకోని అభివృద్ధి అసంపూర్ణమే. రైల్వే అధికారులు కార్యాలయాల్లో కూర్చుని నివేదికలు చూసే బదులు, ఒకసారి సాధారణ ప్రయాణికుడిలా స్టేషన్లో నడిచి చూస్తే వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయి. సమస్యలను కళ్లారా పరిశీలించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన సమయం ఆసన్నమైంది. నిర్లక్ష్యం వీడాలి... బాధ్యత పెరగాలి. ప్రయాణికుల ఇబ్బందులు ఫిర్యాదులుగా మిగిలిపోకూడదు, పరిష్కారాలుగా మారాలి.**




## ఆధునీకరణ చేశారు.... ఆటో స్టాండ్ మరిచారు....



**వాహనాలు నిలుపుదలకు చోటు లేక అస్తవ్యస్తంగా తయారయింది. ప్రయాణికులు ఆటో డ్రైవర్లకు నిత్య ఇబ్బందులు. ప్రణాళికలున్నాయి... అమలు లేదు...! ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడూ? పట్టణం అభివృద్ధి చెందుతోంది... జనాభా పెరుగుతోంది... వాహనాల సంఖ్య రోజుకు అధికమవుతోంది. కానీ వాటికి అవసరమైన శాశ్వత ఆటో స్టాండ్, పార్కింగ్ స్థలం మాత్రం ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడం పట్టణ ప్రణాళికలోని లోపాలను బహిర్గతం చేస్తోంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రధాన కూడళ్ళు మార్కెట్ ప్రాంతాల్లో ఆటో ఎక్కడపడితే అక్కడ నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులను ఎక్కించడం, దించడం కోసం రోడ్లపైనే ఆటోలు నిలవడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "ఆటోలకు స్టాండ్ లేదు. ప్రజలకు సౌకర్యం లేదు. ట్రాఫిక్కు క్రమం లేదు."ఇదే ప్రస్తుతం పట్టణ పరిస్థితి. శాశ్వత ఆటో స్టాండ్ లేకపోవడంతో ఆటో డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ నిలబడాలో తెలియక, పోలీసులు ఒకచోట నుంచి మరొక చోటకు పంపడం, ప్రయాణికులు ఆటో కోసం రోడ్లపైనే వేచి ఉండడం నిత్యాకృతంగా మారింది. వాహనాల నిలుపుదలకు సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లే పార్కింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ జాములు, ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. అత్యవసర సేవల వాహనాలు కూడా రద్దీతో చిక్కుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి. ఈ విషయాన్ని రైల్వే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గుర్తించాలని ప్రయాణికులు కోరుతున్నారు.**






## వైసీపీలోకి వాసాపురం బాబు...?

**యల్లనూరు, జులై 29, అనంత జనశక్తి న్యూస్ ;**



**తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ అనంతపురం పార్లమెంటరీ కార్యదర్శి నరేంద్ర నాయుడు అలియాస్ వాసాపురం బాబు తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలోకి వెళ్ళనున్నట్లు సమాచారం. ఆగస్టు 7న లేదా 15న పార్టీ తీర్థం పుచ్చుకొనున్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడి సర్వం కోల్పోయిన ఎమ్మెల్యే, జిల్లా నేతలు గాని ఆయనను కుటుంబాన్ని పట్టించుకోకపోవడం గ్రామంలో స్టోర్, ఫీల్డ్ ఆసిస్టెంట్ విషయాల్లో కూడా అన్యాయం చేయడం దీనిపై రాష్ట్ర అదిష్టానానికి పిర్యాదు చేసిన స్పందించకపోవడంతో పాటు పలుమార్లు అవమానాలపాలు చేసేలా నేతలు వ్యవహరించడంపై మనస్థాపానికి గురై అయన వర్గీయులు పార్టీ మారుతున్నట్టు సమాచారం. అలాగే మండలంలోని మరికొన్ని గ్రామాల నుండి కూడ అసంతృప్తి నేతలు పార్టీ మారనున్నట్లు సమాచారం.**

# జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి ఐసిసిసి ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి

- నగర ప్రజలు చెత్తను రోడ్లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వాలి..
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలి
- స్వచ్ఛమైన అనంతపురం నిర్మాణానికి నగర ప్రజలందరూ సహకరించాలి..
- జిల్లా కలెక్టర్ మరియు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి ఓ.ఆనంద్..
- అనంతపురం నగర పాలక సంస్థలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC)ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్



**అనంతపురం, జులై 29 :అనంత జనశక్తి న్యూస్**

నగరపాలక సంస్థకు చెందిన అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి వాటి కదలికలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ మరియు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరపాలక సంస్థలో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC)ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కేంద్రం పనితీరును పరిశీలించారు. నగరంలోని సీసీ కెమెరాలు, కంప్యూటర్ వ్యవస్థలు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల పర్యవేక్షణ తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన అన్ని వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా చూసి, సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ, వాహనాల కదలికలు తదితర పౌర సేవలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి, లోపాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు చెత్తను రోడ్లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంతరావును ఆదేశించారు.నగర పరిశుభ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, స్వచ్ఛమైన అనంతపురం నిర్మాణానికి నగర ప్రజలందరూ నగరపాలక సంస్థకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ మరియు అనంతపురం నగరపాల క సంస్థ ప్రత్యేక అధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు, ఎస్.ఈ రాజశేఖర్, ICCC సిబ్బంది, అసిస్టెంట్ ఇంజనీర్లు నవీన్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

- నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత నష్టపెట్టొద్దు: మంత్రి అచ్చెన్నాయుడు
- పొగాకు రైతులకు కేజీకి రూ.20 సాయం.. 94 మిలియన్ కేజీల కొనుగోలుకు చర్యలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.188 కోట్లతో రైతులకు అండగా నిలుస్తున్నాం
- రైతులకు ఉపయోగపడే నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వాగతిస్తాం.. జగన్ రైతులకు మంచి చేసే మాటలు మాట్లాడాలి

**అమరావతి, జూలై 29:అనంత జనశక్తి న్యూస్**




మిత్రపక్షంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. రాజకీయ నాయకుడిగా రైతుల శ్రేయస్సు కోరుకోవడం ప్రధాన లక్షణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు మేలు చేసే సహేతుకమైన, నిర్మాణాత్మకమైన సలహాలను ఏ రాజకీయ పార్టీ నుంచి వచ్చినా ప్రభుత్వం తప్పకుండా స్వాగతిస్తుందని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతుల సమస్యలపై సక్రమంగా స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని హితవు పలికారు.పొగాకు రైతులను గతంలోనూ.. ఇప్పుడూ.. సక్రమంగా ఆదుకున్నది తెదేపా, కూటమి ప్రభుత్వాలేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 201415లో తొలిసారిగా ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు కేజీకి రూ.20 చొప్పున ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 11 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని గుర్తించి గతంలో హెచ్‌డీ బర్లీ పొగాకును 25 మిలియన్ కేజీల మేర రూ.270 కోట్లతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని మంత్రి తెలిపారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు.ప్రస్తుతం అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, బ్రెజిల్, టాంజానియా వంటి దేశాల నుంచి తక్కువ ధరలకు పొగాకు అందుబాటులో ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అచ్చెన్నాయుడు వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, మరోవైపు పొగాకు వ్యాపారులు, కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి రైతుల నుంచి కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు కూడా ప్రభుత్వం చేసిన ప్రయత్నం సఫలీకృతమైందని చెప్పారు.ఎన్ని ఆర్థికపరమైన ఒత్తిళ్లు, ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్రాన్ని ఒప్పించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పొగాకు రైతులకు కేజీకి రూ.20 చొప్పున సాయం అందించేలా చర్యలు చేపట్టాం. 94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు రూ.188 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం చేశాం. అతి కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఎఫ్‌సీవీ పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి టొబాకో బోర్డు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ రైతుల సమస్యలను సమీక్షిస్తూ, ప్రత్యేకంగా దృష్టి సారించి తగిన ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణ, కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే రైతులకు రూ.188 కోట్ల సాయం అందించే స్థాయికి చేరుకున్నామని స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటుంటే జగన్‌మోహన్ రెడ్డికి ఇవేవీ కనిపించడం లేదా? అని మంత్రి ప్రశ్నించారు. నెగిటివ్ స్టేట్‌మెంట్ల ద్వారా మార్కెట్‌ను ప్రభావితం చేసి, రైతుల్లో ఆందోళన పెంచేలా వ్యవహరించడం వల్ల రైతులకే నష్టం జరుగుతుందని అన్నారు.

తన వ్యాఖ్యల వల్ల రైతులు మరింత డిస్ట్రెస్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, కనీసం ఆ విషయమైనా జగన్‌మోహన్ రెడ్డి ఆలోచించాలని సూచించారు.రైతులకు మంచి చేసే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని, అంతే తప్ప రైతులను మరింత ముంచేలా నెగిటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు హితవు పలికారు. జగన్‌మోహన్ రెడ్డి రైతులకు మంచి చేసే పని చేయాలి.. రైతులను మరింత నష్టాల్లోకి నెట్టేలా చేసే వ్యాఖ్యలకు స్వస్తి పలకాలి అని మంత్రి సూచించారు.

# సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

- పదవ తరగతిలో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో 100% ఉత్తీర్ణత సాధించాలి
- నాడు-నేడు కార్యక్రమం ద్వారా పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, జులై 29:అనంత జనశక్తి న్యూస్**



జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ వెల్ఫేర్ సెక్టార్ పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలో విద్యార్థినీ, విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇందులో ముఖ్యంగా వసతి గృహాలలో టాయిలెట్స్, రన్నింగ్ వాటర్ నాడునేడు కార్యక్రమం కింద పెండింగ్లో ఉన్న అదనపు తరగతి గదులు నిర్మాణం వంటి పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు.

ఈ ఏడాది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో 100% ఉత్తీర్ణత సాధించే విధంగా ఇప్పటి నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.మండల విద్యాశాఖ అధికారులు ఎంపీడీవోలు సమన్వయంతో ఔటర్ స్కూల్ విద్యార్థులను గుర్తించి వారందరినీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలలో చేర్పించి వారికి మంచి విద్యనందించి సకాలంలో పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. సంక్షేమ వసతి గృహాలలో, పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య ఏమాత్రం తగ్గకుండా 100% ఉండాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, కేజీబీవీ లలో స్ఫూర్తి, దీప్తి, ప్రగతి, ఉన్నతి అనే కార్యక్రమం ద్వారా 40% లోపల మార్కులు వచ్చిన విద్యార్థినులకు మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా వీరికి మంచి విద్యనందించి 60, 70 శాతం మార్కులు సాధించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్స్ అవసరం ఉన్నట్లయితే ఎంఈఓ లు వెంటనే ప్రపోజల్స్ పంపాలన్నారు.

మండల ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యా శాఖ అధికారులతో కోఆర్డినేషన్ చేసుకుని మోడల్ ప్రైమరీ స్కూల్స్ లలో ఫేస్2, నాడునేడు కార్యక్రమం కింద పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన ఆదర్శ ఎస్సీ కాలనీలలో డ్రింకింగ్ వాటర్ వీధిలైట్లు మరుగుదొడ్లు సమస్య లేకుండా కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శైలజ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి

- అది స్థానిక సంస్థల ఎన్నికలకు ఎంతో ముఖ్యం
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సమావేశం
- పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం జూలై 29, అనంత జనశక్తి న్యూస్**



మనం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నాల్గవ బుధవారం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమన్వయకమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అర్బన్ నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయింపు కోసం తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి పలు కీలక సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి కార్యకర్త, నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం చేయడంలో బీఎల్ఏ లు చాలా కీలకంగా వ్యవహరించారన్నారు. అదే తరహాలోనే ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని తీసుకోవాలన్నారు. ఇందులో కూడా బూత్ ఇన్ ఛార్జిలదే కీలక పాత్ర ఉంటుందన్నారు. మనకు ప్రతి ఓటు కీలకమైందేనన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త వారి పరిధిలోని ప్రతి ఓటర్ ను మనం చేరుకునేందుకు ఇది మంచి అవకాశం అని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో వైసీపీ చేసిన వినాశనాలను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమన్ని తెలియజేయాలన్నారు. త్వరలోనే హౌసింగ్, టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరిస్తున్నామని.. దీనిని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇప్పటికే మూడు రోజులుగా కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. మిగిలిన 42రోజులు కూడా ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనాలన్నారు. జిల్లా కార్యవర్గం కూడా చురుగ్గా పని చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

# ప్రజాసేవకు గౌరవం

- మృతురాలి కుటుంబానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ అండ...
- కుటుంబానికి ఆర్థిక చేయూత....

**ధర్మవరం జులై 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణానికి చెందిన సాకే చెన్నమ్మ ప్రభుత్వ ఆసుపత్రిలో గత 20 సంవత్సరాలుగా పరిశుద్ధ కార్మికురాలిగా సేవలందిస్తున్నారు. అయితే ఈ నెల 26వ తేదీన అనారోగ్య కారణాలతో ఆమె మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెంటనే స్పందించి, మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని తన నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు హరీష్ బాబు మృతురాలు సాకే చెన్నమ్మ నివాసానికి వెళ్లి, ఆమె కుమారుడు, కోడలిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ తరఫున కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ కి, అలాగే స్వయంగా వచ్చి పరామర్శించి చేయూతనందించిన హరీష్ బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, అవసరమైన సమయంలో వెంటనే స్పందించి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని మరోసారి మంత్రి సత్యకుమార్ యాదవ్ నిరూపించారని స్థానికులు అభిప్రాయపడ్డారు.




# ఎలినో ప్రభావంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- త్రాగునీరు, పశుసంరక్షణ, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి జూలై 29, అనంత జనశక్తి న్యూస్**




ఎలినో ప్రభావంతో జిల్లాలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అధికారులను కోరారు.సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఎలినో ప్రభావంపై సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఎలినో ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశమున్నందున, ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా నిరంతరాయంగా ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా పశువుల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు అవసరమైన స్క్రీనింగ్, చికిత్సలు అందించాలని సూచించారు. పశుసంపదను కాపాడేందుకు అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవసాయ రంగంలో సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రకృతి స్నేహపూర్వక సాగు పద్ధతులపై ప్రోత్సాహం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే భవిష్యత్ తరాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులను కూడా సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ప్రత్యేకంగా సూచించారు.ఎలినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సమావేశంలో అధికారులు నిర్ణయించారు.

# 5ఏళ్ల తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని 20ఏళ్లు వెనక్కు నెట్టారు



- ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- సూర్యనగర్ లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం
- డీఎస్సీపై బహిరంగ చర్చకు రమ్మంటే ఎందుకు పారిపోతున్నారు
- వైసీపీ నేతలపై ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు

**అనంతపురం జూలై 29, అనంత జనశక్తి న్యూస్**

5ఏళ్ల తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని 20ఏళ్లు వెనక్కు నెట్టారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని సూర్యనగర్ లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దగ్గుపాటికి ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ, దుకాణం వద్దకు వెళ్లి రెండేళ్ల పాలన గురించి ఎమ్మెల్యే వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజా స్పందనను తెలుసుకున్నారు. అలాగే కొన్ని చోట్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అభివృద్ధిపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో ప్రజల్ని పీడించారు, రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం వెనుకబడిపోయిందని.. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. వైసీపీలో ఉద్యోగుల్ని, ఉపాధ్యాయుల్ని పించనర్లను ఇబ్బంది పెట్టారని.. వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలిసేది కాదన్నారు. కానీ ఈరోజు 1వ తేదీన పించన్లు, వేతనాలు, రేషన్ బియ్యం అందిస్తున్నామన్నారు. డీఎస్సీ పేపర్ లీకేజి అంటూ వైసీపీ నాయకులు కొత్త నాటకం మొదలు పెట్టారని.. దీనిపై బహిరంగ చర్చకు రమ్మని మంత్రి నారా లోకేష్ సవాల్ చేస్తే పారిపోతున్నారన్నారు. కేవలం 150రోజుల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియని పూర్తి చేసి.. 15,347ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఒక కాలువ కానీ.. ఒక రోడ్డు కూడా నిర్మించలేదన్నారు. కానీ 2ఏళ్లలోనే మౌళిక వసతుల కోసం 200కోట్లు ఖర్చు చేసినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ గడ్డం సుబ్రహ్మణ్యం, బుగ్గయ్య చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బాలాంజనేయులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లక్ష్మీదేవి, కోయూనిట్ ఇంచార్జ్ ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బోయ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, టిడిపి నాయకులు కమ్మూరు నాగరాజు, డిష్ నాగరాజు, సరిపూటి శ్రీకాంత్, మున్వర్, నారాయణస్వామి యాదవ్, కార్పోరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా జరుగుతున్న తారు రోడ్డు పనులు

- ఎమ్మెల్యే అమిలినేని గారి చొరవతో అందుబాటులోకి రానున్న కళ్యాణదుర్గం నుంచి బొమ్మగానిపల్లి రోడ్డు

**కళ్యాణదుర్గం జూలై 29 అనంత జనశక్తి న్యూస్**



వైసీపీ ప్రభుత్వం హయాంలో కేవలం కంకర తోలి వదిలేయడంతో ఆ రహదారి వెంట వెళ్ళాలి అంటే భయం గుప్పిట్లో ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఎన్నో సార్లు మంత్రి చెప్పారు అదిగో ఇదిగో అంటూ కానీ ఏనాడు రోడ్డు పూర్తి చేయాలన్న ఆలోచన కానీ వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు..మంకెందుకులే అనుకుందో లేక ఆ రోడ్డు వేస్తే మనకేమి లాభం అనుకుందో మరి ఐదేళ్లు చెప్పడంతోనే గడిపేసి చివరకు నియోజకవర్గమే మార్చేసి వెళ్ళిపోయింది.. కళ్యాణదుర్గం నుంచి బొమ్మగానిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తికాక ఎన్నో ఏళ్లుగా నరక ప్రయాణం అనుభవిస్తున్న అనేక గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే అమిలినేని చొరవతో నేడు రహదారులు చక చక నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నాయి..నాణ్యతతో పాటు, శరవేగంగా పనులు చేస్తుండటంతో ఆయా గ్రామాల నుంచి నిత్యం ప్రయానించే ప్రజలు, వాహనదారులు సంతోషంతో పాటు ఎమ్మెల్యే పనితీరుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు

# ఘనంఘా గురుపౌర్ణమి వేడుకలు....



**యల్లనూరు, జులై 29, అనంత జనశక్తి న్యూస్;**

మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అక్కడ వచ్చిన భక్తులకు దాతల సాయంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారికి మొక్కలు తీర్చుకున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**అమడగూరు, జులై 29, అనంత జనశక్తి న్యూస్**

ఆమడగూరు, మండలంలో,అమడగూరు జోకులకొత్తపల్లి గ్రామలలో,వెలసిన శ్రీ షిరిడి సాయి బాబా మందిరములో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగియి.వివిధప్రాంతాల నుండి వేలాది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు కార్యక్రమాలు నిర్వహించారు అక్కడికి వచ్చిన భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు దేవాలయాల్లో భక్తాదులు భజన కళాకారులు వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు అక్కడికి వచ్చినటువంటి తీర్థప్రసాదాలు భక్తులందరికి భోజనాలు ఏర్పాటు చేసారు.గత నాలుగు, సంవత్సరాలుగా గురుపౌర్ణమికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు అదే క్రమంలో షిరిడి సాయిబాబా దేవాలయంలో, భక్తులందరు విరాళాలు ఇచ్చి మందిరములో జరిగే అన్నదానం కార్యక్రమానికి తొడ్పాటు,నందించారు మందిరములో కార్యక్రమాలన్నింటిని ట్రస్ట్ సభ్యులు మరియు గ్రామ ప్రజలు సమిష్టిగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో జెకె పల్లి ట్రస్ట్ సభ్యులు మరియు,అమడగూరు భక్తి మండల సభ్యులు భజన కళాకారులు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు అది వైభవంగా నిర్వహించారు

# ఐదేళ్లుగా అసంపూర్తిగా జూనియర్ కాలేజీ టాయిలెట్ నిర్మాణం



**- పనులు మధ్యలోనే నిలిపివేత.. విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు.**
**- వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి.**

**అనంతగిరి జూలై 29, అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన టాయిలెట్ నిర్మాణ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉండిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించినప్పటికీ, అవి మధ్యలోనే నిలిచిపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది.స్థానికుల కథనం ప్రకారం, నిర్మాణ పనులు కొంతవరకు పూర్తయ్యాక సకాలంలో బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని తెలుస్తోంది. అప్పటి నుంచి నిర్మాణం అలాగే ఉండిపోవడంతో టాయిలెట్ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి అడవిని తలపించేలా మారాయి. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా విద్యార్థినులు మరింత అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. విద్యా సంస్థల్లో పారిశుద్ధ్య సౌకర్యాలు తప్పనిసరి అయినప్పటికీ, ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఈ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో పిచ్చి మొక్కల మధ్య పాములు,విషపురుగులు సంచరించే అవకాశం ఉండటంతో విద్యార్థుల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. అసంపూర్తి నిర్మాణం కారణంగా ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని, వెంటనే నిర్మాణ పనులను పునఃప్రారంభించి పూర్తి చేసి విద్యార్థుల వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు. విద్యార్థుల సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు అత్యవసరంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ప్రాథమిక అవసరమైన పారిశుద్ధ్య సౌకర్యాల విషయంలో ఇకనైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**యాడికి, జూలై 29, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న సాయి బాబా దేవాలయంలో బుధవారం ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం సాయి బాబా కు పంచామృత అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు.అర్చనలు చేసి, మహా మంగళహారతులు సమర్పించారు.భక్తులు ఉదయం నుండి క్యూలో నిలబడి సాయి బాబా ను దర్శించి, టెంకాయలను కానుకలను సమర్పించారు. జై సాయి బాబా మహారాజ్ కు జై అనే నామం మారుమ్రోగింది.భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# రెండేళ్లలో ఒక కుటుంబానికి రూ.7.60లక్షల లబ్ధి జరిగింది



**- మా ప్రభుత్వం అందించే సంక్షేమానికి ఇంతకన్న నిదర్శనం ఏం కావాలి**
**- 2ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత**
**- రాప్తాడులో ఇంటింటా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే సునీత**
**- గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుని ఆలయంలో పూజలు**
**- పండమేరు, సనప రేణుక ఎలమ్మ ఆలయాలకు రూ.4కోట్లు మంజూరు**

**రాప్తాడు జూలై 29, అనంత జనశక్తి న్యూస్**

రెండేళ్లలో కేవలం 2పథకాలకే ఒక కుటుంబానికి రూ.7.60లక్షలు, మరో కుటుంబానికి రూ.4.12లక్షలు అందించామని.. ఈ ప్రభుత్వం అందించే సంక్షేమానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వైసీపీని ప్రశ్నించారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో కూటమి ప్రభుత్వం 2ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాప్తాడుకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు కూటమి నాయకులు, పార్టీ శ్రేణులతో పాటు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గురుపౌర్ణమి సందర్భంగా ఆమె సాయినాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాను దర్శించుకుని ఆలయంలో కాసేపు గడిపారు. అనంతరం బీసీ కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. గుడ్లు, పౌష్టికాహారం ఎలా అందుతోందని ఆరా తీశారు. పిల్లలు ఎంత మంది ఉన్నారు.. ఎవరెవరికి ఏమి ఇస్తున్నారన్నది తెలుసుకున్నారు. ఆ తర్వాత ఇంటింటికీ కూడా రెండేళ్లలో చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల వారు తమకు అందిన పథకాల గురించి వివరించడంతో ఎమ్మెల్యే సునీత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దండు నాగేంద్రమ్మ తల్లి వట్టే రామక్క అనారోగ్యంతో, వయసు రీత్యా మంచానికి పరిమితమవగా ఆమెకు ప్రతి నెల 15వేల రూపాయలు, దండు నాగేంద్రమ్మ కుమారుడు దండు జగన్ మతిస్థిమితం లేకపోవడంతో ప్రతి నెల 15 వేల రూపాయలు ప్రకారం ఇద్దరికీ కలిపి ఒక సంవత్సరానికి 3లక్షల 60వేల రూపాయలు ప్రకారం రెండేళ్లలో 7లక్షల 20వేలు అందిందన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ ప్రతి సంవత్సరం 20వేల ప్రకారం రెండేళ్లలో 40వేలు ఇలా మొత్తం రూ.7.60లక్షలు లబ్ధి చేకూరిందని స్థానిక నాయకులు తెలిపారు. అలాగే వరలక్ష్మి కుమారుడు ప్రణవ్ పుట్టుకతోనే వైకల్యంతో జన్మించగా ఆ అబ్బాయికి ప్రతి నెల 15 వేలు చొప్పున సంవత్సరానికి 1లక్ష 80 వేలు.. ఈ రెండేళ్లలో 3లక్షల 60వేల రూపాయలు, కుటుంబంలో ఇద్దరు పిల్లలుండగా తల్లికి వందనం కింద 26వేలు చొప్పున అనగా రెండేళ్లకు 52 వేల రూపాయలు ప్రకారం మొత్తం రూ.4.12లక్షల లబ్ధి చేకూరిందన్నారు. తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. మేము మాటలు చెప్పమని.. నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు. రాప్తాడు సమీపంలో జాకీ స్థానంలో రేమాండ్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. త్వరలోనే మార్కెట్ యార్డును కూడా నిర్మించనున్నట్టు చెప్పారు.

అలాగే శ్రీ పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం అభివృద్ధికి 2కోట్ల 86లక్షలు, ఆత్మకూరు మండలం సనప గ్రామంలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి 1కోటి 14లక్షలు దేవదాయ శాఖ నుంచి మొత్తం 4కోట్లు నిధులు మంజూరైనట్టు చెప్పారు. ఇందులో 20 శాతం నిధులు ఆయా దేవాలయాలనుంచి చెల్లించాల్సి ఉంటుందని.. దాతలు సహకరించి ముందుకు రావాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు..



# అద్వానంగా ఆర్.టి.పురం ఎన్ఆర్ఈజీఎస్ రోడ్డు నిర్మాణ పనులు



*** ఏడాది గడిచినా పూర్తి కాని రూ.2.50 లక్షల రహదారి**
*** గుత్తేదారుడు–అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**
*** పనులు పూర్తి చేయకపోతే కలెక్టర్‌కు పీజీఆర్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక**

**అనంతగిరి, జూలై 29 ,అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పరిధిలోని జీడిపాలెం గ్రామం నుంచి ఆర్.టి.పురం గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ (కాంపినెంట్) నిధుల కింద రూ.2.50 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాది గడిచినా నేటికీ పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేయడంతో పాటు నాసిరకంగా మెటల్ వేసి వదిలేయడం వల్ల రహదారి పూర్తిగా దెబ్బతిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత గుత్తేదారుడు పనులను అసంపూర్తిగా వదిలేయగా, అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా అధికారులు, గుత్తేదారుడితో కుమ్మక్కయ్యారనే అనుమానాలు కూడా గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రహదారిపై వేసిన మెటల్ చెదిరిపోయి, అనేక చోట్ల గోతులు ఏర్పడి బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి తరలించడం, గర్భిణీ స్త్రీలను ప్రసవం కోసం తీసుకెళ్లడం కూడా ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ రహదారే ఆర్.టి.పురం గ్రామానికి ప్రధాన మార్గం కావడంతో నిత్యావసర వస్తువుల రవాణా, విద్యార్థుల రాకపోకలు, అత్యవసర సేవలన్నీ ఇబ్బందికరంగా మారాయని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులను పర్యవేక్షించి, గుత్తేదారుతో మిగిలిన రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయించి గ్రామానికి శాశ్వత రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి పనులను పునఃప్రారంభించకపోతే గ్రామస్తులతో కలిసి పీజీఆర్ (స్పందన) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోసూరు రవి హెచ్చరించారు.



# జూలై 31తో గడువు ముగుస్తుంది..

**- రైతులందరూ వెంటనే పంటల బీమా చేయించుకోండి: మంత్రి అచ్చెన్నాయుడు**
**- ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులకు పంటల బీమాయే భరోసా**
**- చివరి రోజు వరకు వేచి చూడొద్దు... ఇప్పుడే నమోదు పూర్తి చేసుకోండి**

**అమరావతి, జూలై 29:అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలోని రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా నమోదును జూలై 31వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వరదలు, కరువు వంటి అనూహ్య పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతు కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచేది పంటల బీమా మాత్రమేనని ఆయన అన్నారు. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున ఒక్క రైతు కూడా ఈ అవకాశాన్ని కోల్పోవద్దని పిలుపునిచ్చారు. రైతులు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. గడువు ముగిసిన అనంతరం నమోదు అవకాశం ఉండకపోవచ్చని, అందువల్ల ప్రతి రైతు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పంట సాగు కోసం రైతు ఏడాది పొడవునా పడే శ్రమకు భద్రత కల్పించే ముఖ్యమైన సాధనం పంటల బీమా అని పేర్కొన్నారు.రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం పంటల బీమా నమోదును సులభతరం చేసిందని మంత్రి తెలిపారు. PMFBY Crop Insurance Farmer App ద్వారా రైతులు స్వయంగా బీమా నమోదు చేసుకోవచ్చని, అలాగే కామన్ సర్వీస్ సెంటర్లు (CSC), సంబంధిత బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (PACS), గ్రామ, మండల వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో కూడా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని వివరించారు. బీమా నమోదు సమయంలో అవసరమైన పత్రాలు, భూమి వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర సమాచారాన్ని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత రసీదు లేదా ధ్రువీకరణ వివరాలను తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి అర్హ రైతు పంటల బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.రైతు ఏడాది శ్రమను కాపాడేది పంటల బీమా. కాబట్టి జూలై 31 గడువు ముగిసేలోపు ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకుని తమ పంటలకు పూర్తి భద్రత కల్పించుకోవాలి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోసారి విజ్ఞప్తి చేశారు.




# ఈ నెల 31న చేపట్టే ధర్నా ను జయప్రదం చేయండి"

**- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్. సిఐటియు. ....**

**పుట్టపర్తి రూరల్ జూలై 29 అనంత జన శక్తి న్యూస్.**

ఆశావర్కర్స్ కీ కనీసవేతనాలు చెల్లించాలని, అన్నిరకాల సెలవులు ఇవ్వాలని, మట్టిఖర్చులు ఇవ్వాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, శిక్షణ పొందిన ఎఎన్ఎం, జిఎన్ఎం లకు పర్మినెంట్ పోస్టుల భర్తీసందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలని కోరుతూ ఈనెల 31వ తేదీన పుట్టపర్తి కలెక్టర్ కార్యాలవద్ద జరిగే ధర్నాలో జిల్లాలోని ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పుట్టపర్తి సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు బికె. రాధమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ .సౌభాగ్య, జిల్లా కోశాధికారి పి. రమాదేవి ,ఆఫీస్ బేరర్స్ అంజినమ్మ, చంద్రకళ, ముంతాజ్, చెన్నకృష్ణమ్మ పిలుపునిచ్చారు ఆశా వర్కర్స్ కీ కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. వేతనాలు పెంచి 7 సంవత్సరాలు అయ్యింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశావర్కర్ను్క వేతనాలు పెంచాలని కోరారు.20 సంవత్సరాలుగా ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశావర్కర్లకు శెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలౌతున్నారు. కావున అంగన్వాడీలకు అమలవుతున్న అన్ని రకాల శెలవులు (వేసవి శెలవులు మినహా) ఆశావర్కర్లు అమలు చేయాలని కోరుచున్నాము. ప్రభుత్వం చెల్లించే 10 వేలలో నెలలో పిహెచ్సిలకు , ఆసుపత్రులకు వెళ్ళడానికి 3,4 వేలు ఖర్చులవుతున్నాయిసంబంధంలేని పనులు చేయించడం, అధిక జనాభాలో పనిచేయటం వలన ఆశావర్కర్స్ తీవ్ర పనిఒత్తిడికి గుర్రై అనారోగ్యంపాలౌతున్నారనీ. కావున ఆశావర్కర్స్ సమస్యలు సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కనీస వేతనాలు చెల్లించాలనీ,అన్ని రకాల నెలవులు ఇవ్వాలి. (వారాంతపు నెలవు, నేషనల్ హాలిడేస్, పండుగసెలవులు, క్యాజువల్ లీవ్స్,




మెడికల్ లీవ్స్)దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలనీ ,నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి,ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్స్ సంఖ్యను పెంచాలనీ,విహెచ్ఐసి కి వెళ్ళిన ప్రతి సందర్భంలో టివి, డివి లు ఇవ్వాలనీ ఎఎన్ఎం, జిఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలి. 10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి ,నాణ్యమైన మొబైల్స్, యూనిఫామ్ ఇవ్వాలి.గ్రాట్యూటికి సీలింగ్ ఎత్తివేయాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# నేర రహిత జిల్లాగా మార్చడమే తమ ధ్యేయం

**– జిల్లా ఎస్పీ సతీష్ కుమార్...**

**పుట్టపర్తి రూరల్ జూలై 29 అనంత జన శక్తి న్యూస్.**

శ్రీ సత్య సాయి జిల్లాను నేర రహిత జిల్లాగా మార్చడమే తమ ఉద్దేశమని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోందని బుధవారం
జిల్లా ఎస్పీ తన చాంబర్లో వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ
గత ఆరు నెలలగా జిల్లాలో పోలీస్ శాఖ ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు ఇస్తున్నాయని 254 కేసులు నమోదు చేసి రూ 25 లక్షల 40 వేల జరిమానాలు విధించడం జరిగిందని, రాష్ట్రంలోనే ఇది ఒక రికార్డు అని ఎస్పీ స్పష్టం చేశారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 364 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, వాటిలో 254 కేసులను గౌరవ న్యాయస్థానంలో దాఖలు చేశామని కోర్టు ద్వారా ఇప్పటివరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నిమిత్తం 25,40,000/ జరిమానా వసూలు చేశారనీ,చట్టపరమైన నిబంధనలు: మోటారు వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 185 ప్రకారం 100 మి.లీ. రక్తంలో 30 మి.గ్రా. కంటే ఎక్కువ ఆల్కహాల్ (BAC) ఉంటే, న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా ₹10,000 వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.
నలుగురికి జ్యుడీషియల్ కస్టడీ 8 మంది లైసెన్సులు సస్పెన్షన్ చేశాం.



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన నలుగురు నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. (కదిరి రూరల్ ,కదిరి టౌన్, తనకల్ , కొత్తచెరువు, అర్బన్ పరిధిలో ఈ చర్యలు తీసుకున్నారు). పదేపదే నిబంధనలు ఉల్లంఘించిన 8 మంది డ్రైవర్ల లైసెన్సులను సస్పెండ్ చేశాము.(కదిరి అర్బన్ 3, గౌరంట్ల 3, పెనుకొండ 1, చిలమత్తూరు ,1 ఈ చర్యలు మోటారు వాహనాల చట్టం-1988 సెక్షన్ 19(1)(d), 19(1)(f), సెంట్రల్ మోటారు వాహనాల నియమావళి-1989 రూల్ 21 ప్రకారం చేపట్టినట్లు తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై ఉక్కుపాదం:
జిల్లా వ్యాప్తంగా 2,248 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు కాగా, అందులో 1,115 కేసులను భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 292 కింద సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలు చేశారు.
దీని ద్వారా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారి నుండి ఇప్పటివరకు ₹8,56,400/ జరిమానా వసూలు చేశామని,
"మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు పోవడమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందనీ. 'మద్యం సేవించి వాహనం నడపవద్దనీ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దు. చట్టాలను గౌరవించాలని , మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడండనీ తెలిపారు' శ్రీ సత్యసాయి జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులో మరిన్ని కఠిన చర్యలు ఉంటాయి." అని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# విద్యుత్తు కేబుల్ వైర్లు చోరీ దొంగలు అరెస్ట్..

**- బాధిత రైతులకు నగదు అందజేత డి.ఎస్.పి సీఐ సుమతి..**

**గాండ్లపెంట, జూలై 29, అనంత జనశక్తి న్యూస్,**

మండల వ్యాప్తంగా గత ఆరు నెలలుగా రైతుల వ్యవసాయ బోర్ల వద్ద అమర్చిన విద్యుత్ కేబుల్ వైర్లు చోరీకి పాల్పడిన నిందితులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన కేబుల్ వైర్లు చోరీకి సంబంధించిన వివరాలను డీ ఎస్ పి వెల్లడించారు. మండలంలోని మల్ల మీద పల్లి గ్రామానికి చెందిన షేక్ చాంద్ బాషా, సోమశేఖర్ అనే ఇరువురు గత ఆరు నెలలుగా వ్యవసాయ బోర్లు వద్ద రైతులు అమర్చిన విద్యుత్తు కేబుల్ వైర్లను దొంగలించారు. 10 గ్రామాల్లో దాదాపు 32 మంది బాధిత రైతులకు సంబంధించిన విద్యుత్తు



కేబుల్ వైర్లను వీరు అపహరించినట్లు డి.ఎస్.పి తెలియజేశారు. అపహరించిన కేబుల్ వైర్ల లో ఉన్న రాగి వైరు అమ్మి సొమ్ము చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులైన షేక్ చాంద్ భాషా నుంచి రూ. లక్ష రూపాయలు, సోమశేఖర్ నుంచి రూ.91 వేలు చొప్పున రికవరీ చేసినట్లు డి.ఎస్.పి వివరించారు. నిందితుల నుంచి రికవరీ చేసిన నగదు మొత్తాన్ని బాధిత రైతులకు ఒక్కోమీటర్ కు రూ.200లు చొప్పున బాధిత రైతులకు కేబుల్ వైర్లకు బదులుగా నగదును అప్పగించినట్లు డి.ఎస్.పి తెలిపారు. గతంలో చోరీకి గురైన కేబుల్ వైర్లను కోర్టు కు అప్పగించిన అనంతరం రైతులకు అందేదని తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై సుమతి ఆధ్వర్యంలో నిందితుల నుంచి నగదును రికవరీ చేసి నేడు బాధిత రైతులకు అప్పజెప్పడం జరుగుతోందని వివరించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ నాగేంద్ర, స్థానిక ఎస్సై సుమతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

# అగాపే ఆశ్రమం లో అన్నదానం

**యాడికి, జూలై 29,అనంత జనశక్తి న్యూస్ :**

**మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమం లో వృద్ధులకు బుధవారం అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకుడు, టింబర్ డిపో యాజమాని జూటూరు బషీర్ మనవడు అయాన్ షహజద్ జన్మదిన సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. ఆశ్రమానికి రెండు ట్రాక్టర్లు కట్టెలను అందచేశారు. అయాన్ షహజద్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు. ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.**



# సెప్టెంబర్ 12న సత్తెనపల్లిలో జాతీయ లోక్ అదాలత్

**- పెండింగ్ కేసుల రాజీ పరిష్కారానికి సువర్ణావకాశం**

**సత్తెనపల్లి, జూలై 29:అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, అమరావతి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, గుంటూరు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 12 (రెండవ శనివారం)న సత్తెనపల్లి మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవా కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయకుమార్ రెడ్డి తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ వివాదాలు, బ్యాంకు సంబంధిత కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్కు బకాయిల కేసులు, రెవెన్యూ కేసులు, న్యాయస్థానానికి వెళ్లకముందే పరిష్కరించదగిన ప్రీలిటిగేషన్ కేసులు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో పరిష్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు.న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాల సమ్మతితో త్వరితగతిన పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, న్యాయస్థానాన్ని ఆశ్రయించకముందే పరిష్కరించదగిన వివాదాలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.

# ప్రభుత్వ పథకాల ప్రచారంలో పత్రికారంగం కీలకం

**శాఖపట్నం, జూలై 29:అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో పత్రికారంగం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా, గ్రామీణ విలేకరుల కోసం విశాఖపట్నంలో నిర్వహించిన "వార్తాలాప్" ఒకరోజు మీడియా శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళా సాధికారత, డిజిటల్ పాలన, ఆర్థిక చేరిక, సామాజిక సంక్షేమం వంటి రంగాల్లో దేశం సాధించిన పురోగతిని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి బలమైన పునాది వేశాయని తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో విలేకరుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న మంత్రి, ప్రభుత్వ పథకాలపై ఖచ్చితమైన, వాస్తవిక సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని సూచించారు. జిల్లా, గ్రామీణ విలేకరులు ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా నిలుస్తూ, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో ముఖ్యమైన బాధ్యత నిర్వర్తిస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా పీఐబీ విజయవాడ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులపై ప్రామాణికమైన, వేగవంతమైన సమాచారాన్ని మీడియాకు అందించడంలో పీఐబీ కీలక అనుసంధానకర్తగా పని చేస్తోందని తెలిపారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విలేకరులకు సమగ్ర అవగాహన కల్పిస్తాయని చెప్పారు.కార్యశాలలో రక్షణ, కస్టమ్స్, రైల్వే శాఖలకు చెందిన సీనియర్ అధికారులు తమ తమ శాఖల కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలపై విలేకరులకు వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విలేకరులతో పరస్పర చర్చ నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు.




# అనంతపురం డీఎస్పీగా ఎం. చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ




**అనంతపురం, జూలై 29:అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం పోలీసు ఉపవిభాగం (డీఎస్పీ) నూతన అధికారిగా ఎం. చంద్రశేఖర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి నుంచి బదిలీపై వచ్చిన ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల్లో పోలీసు వ్యవస్థపై మరింత విశ్వాసం పెంపొందేలా పారదర్శకంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో నేరాల నివారణకు మరింత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

### అనుభవజ్ఞుడైన అధికారి

ఎం. చంద్రశేఖర్ 1995 బ్యాచ్‌కు చెందిన పోలీసు అధికారి. 1992 నుంచి 1995 వరకు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉద్యోగిగా సేవలందించిన ఆయన, అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికై ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.2010లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో శాంతిభద్రతల విభాగంతో పాటు నేర పరిశోధన విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన, మంగళగిరి నుంచి అనంతపురానికి బదిలీపై వచ్చి బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

# అమ్మవారి శాలలో ఆషాఢ మాస పౌర్ణమి పూజలు




**యాడికి, జూలై 29,అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న కన్య కాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాస పౌర్ణమి సందర్భంగా సామూహిక రమా సత్య నారాయణ స్వామి వ్రతంను, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు. రుద్రాభిషేకం,నవగ్రహ పూజ కార్యక్రమం ను నిర్వహించారు.దంపతుల చేతుల ఘనంగా సత్యనారాయణస్వామి ను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యనారాయణస్వామి వ్రతం ను తిలకించారు. టెంకాయలను, కానుకలను సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో గాధం శెట్టి బాల, లయన్ పవన్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, వాసవి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు

# పెద్దమ్మకు ఆఫాడ పౌర్ణమి పూజలు

**యాడికి, జూలై 29,అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవా లయంలో బుధవారం పెద్దమ్మతల్లికి ఆఫాడ మాసం పౌర్ణమి పూజ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పెద్దమ్మ తల్లి కి గంగా పూజ, పంచామృతాభి షేకము చేసి, నూతన వస్త్రాలతో, పలు రకాల పుష్పాలతో అలంకరించారు. కుంకుమార్చన, లలితా సహస్రనా మావళి పఠించారు. భక్తి పాటలతో ఆలపించారు. పెద్దమ్మ తల్లికి భక్తులకు దర్శించి, కానుకలను, టెంకాయలను సమర్పించారు.పెద్దమ్మతల్లి నామం భక్తులతో పరిసర ప్రాంతాలన్నీ మారుమోగా యి. భక్తులకు తీర్థ ప్రసాదాలను, అల్పాహారం ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాథంశెట్టి బాలా,లయన్ పవన్ ,ఆలయ కమిటి సభ్యులు, మహిళా కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# విజన్ విద్యార్థులకు ప్రశంసల వెల్లువ



**- చాంపియన్షిప్ లో విజన్ విద్యార్థుల ప్రతిభ**

**యాడికి , జూలై 29, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న విజన్ విద్యార్థులు అనంత చాంపియన్షిప్ లో విజన్ విద్యార్థుల ప్రతిభ కనపరచారని బుధవారం విశ్వనాథ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం చాంపియన్షిప్ బాలుర కబడ్డీ పోటీల్లో విజన్ విద్యార్థులు విన్నర్ గా నిలిచారని తెలిపారు. అనంత ఛాంపియన్షిప్ అథ్లెటిక్స్ పోటీల నందు విశేష ప్రతిభ కనపరిచారన్నారు. అండర్ 14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో జి.శ్రీరంగ కుమార్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, ఎస్ కార్తీక్ మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ ని దక్కించుకొన్నారని, 200 మీటర్ల పరుగు పందెంలో విజన్ స్కూలుకు చెందిన హానిత్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ దక్కించుకొన్నారని తెలిపారు . పలువురు విద్యార్థులను అభినందించారు.

# రోడ్డెక్కి... ఏరులై పారుతున్న మురుగు నీరు.. ఇబ్బందులో ప్రజలు

**అగళి జూలై 29,అనంత జనశక్తి న్యూస్**



మండలకేంద్రంలోని రత్నగిరి రోడ్డుపై ఏళ్ల తరబడి మురుగునీరు పారుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది.కృష్ణ... గోదారినదిలా... ప్రవహిస్తోంది దీంతో ఆప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామంలోని ప్రధాన రహదారి రత్నగిరి రోడ్డుపై దేవాలయాలకు వెళ్లే రోడ్డు కావడంతో నిత్యం ప్రజలు తిరుగుతుంటారు. అలాగే ఆదర్శ పాఠశాలకు విద్యార్థులు కూడా నడుచుకొంటూ ఈరోడ్డుగుంట పోవలసిందే. రోడ్డుపై పారుతున్న మురుగుతో వాహనదారులు, పాదచారులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పైఇండ్లలోంచి వచ్చే మురుగునీరు సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తూ ఎక్కడ మురుగు అక్కడ నిల్వ ఉంటుంది. సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో రోడ్డు అంత మురుగునీరుతో మారుమ్రోగుతోంది. పై వాసవి మహల్ నుంచి బస్టాండ్ మలుపు రావిచెట్టు వరకు ఇదే దుస్థితి. రోడ్డుపై చిన్న చిన్న మురుగు గుంతలు సైతం పెద్ద గుంతలుగా మారుతున్నాయి. దీంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజలు మలేరియా, డెంగ్యూ రోగాలకు గురైతున్నారు. మురుగునీరుతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. మలుపు వద్ద అయితే మురుగు నీరు రచ్చ రచ్చగా ఏర్పడిందన్నారు. ఒక్క రోజు రెండు రోజులు కాదు వారం రోజులు కూడా కాదు ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి అని స్థానికులు మండిపడుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడు కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు




**- భారీ అన్నదానం**

**సామర్లకోట, జూలై 29 :అనంత జనశక్తి న్యూస్**

సామర్లకోట స్టేషన్ సెంటర్లో వేంచేసి ఉన్న సాయిబాబా ఆలయంలో ఆంధ్ర సాయి గీతా సమాజం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రసాద్ శర్మ చే శిరిడి సాయిబాబా మూల విరాట్ కు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోగా మధ్యహ్నం వరకు సాయిబాబా ను దర్శనాలు కొనసాగాయి. అనంతరం రైల్వే కళ్యాణ మండపం ఆవరణలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.అంతకు ముందు మేళ తాళాలు మంగళ వాయిద్యాలు తో స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అలాగే పట్టణంలోని పెద్దబజార్ మెయిన్ రోడ్డులో గల సాయి బాబా ఆలయంలో ఆలయ ధర్మకర్త క్షత్రియ సింగ్ ఆధ్వర్యంలో, స్థానిక కోట్లమ్మ చెరువు వద్దగల సాయిబాబా ఆలయంలో సుభాన్ క్షత్రి సింగ్ కుటుంబం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే పెద్దాపురం పట్టణం లోని ఆర్డీవో కార్యాలయం వద్దగల సాయి బాబా ఆలయంలో పట్టణంలోని అన్ని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర సాయి గీత సమాజం నాయకులు దన్నాల అప్పారావు, దవులూరి సుబ్బారావు, గంద్రోతుల సత్యనారాయణ, కొప్పన రాంబాబు, బర్లంకి రామారావు, ఆయా ఆలయాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## లేపాక్షి తహసీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ తనిఖీ – రీసర్వే పనులపై ఆరా



**జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**

**లేపాక్షి జూలై 29:అనంత జనశక్తి న్యూస్**

లేపాక్షి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. లేపాక్షి పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. లేపాక్షి, పులమతి, కొండూరు, కోడిపల్లి గ్రామాల్లో రీసర్వే పురోగతిని, భూ హద్దుల గుర్తింపు ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలో జరుగుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని, రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. భూ రీసర్వే ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సర్వే సంబంధిత ఫిర్యాదులు మరియు దరఖాస్తులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు.హద్దుల గుర్తింపు, పాస్ పుస్తకాల జారీ ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత పాటించాలని అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు.రీసర్వేకు సంబంధించిన వివిధ రిజిస్టర్లు, మండలంలో అందిన అర్జీల పరిష్కార స్థితిని ప్రత్యక్షంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కుమార్ రెడ్డి , సర్వే డిపార్ట్ మెంట్ సిబ్బంది మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## బహిరంగ చర్చకు రావాలి

**మంత్రి లోకేష్ పేర్ని నాని సవాల్**

**డీఎస్సీ నియామకాలపై కొత్త వివాదం**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని 2025 మెగా డీఎస్సీ నియామకాల ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేష్ కేవలం డీఎస్సీ నియామకాల కోసమే ఉపయోగించుకున్నారని, మొత్తం నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. ఎస్సీఆర్టీ కన్వీనర్‌కే డీఎస్సీ కన్వీనర్ బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ ఒకే వ్యవస్థ చేతిలో జరిగాయని ఆయన అన్నారు. గోప్యంగా ఉండాల్సిన పరీక్షల ప్రక్రియలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించారని, ప్రశ్నపత్రాల తయారీ నుంచి మార్కుల అప్‌లోడింగ్ వరకు ఒకే బృందం పని చేసిందని ఆరోపించారు.

ఎస్సీఆర్టీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కు తొలుత కృష్ణా జిల్లా టాప్ ర్యాంక్ వచ్చిందని, మొదటి మెరిట్ లిస్ట్‌లో టాపర్‌గా ఉన్న అతని పేరును తర్వాత తొలగించి రెండో మెరిట్ లిస్ట్‌లో మరో అభ్యర్థిని టాపర్‌గా ప్రకటించారని పేర్ని నాని పేర్కొన్నారు. రెండు మెరిట్ లిస్టులు ఎందుకు విడుదల చేశారో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ మెరిట్ లిస్టును కలెక్టరేట్‌లో ప్రదర్శించకుండా కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఎందుకు విడుదల చేశారని కూడా ఆయన ప్రశ్నించారు.

## మహిళా పారిశ్రామికవేత్తల కోసం బృహత్తర ప్రణాళిక...!

**- వెదురు పెంపకం ప్రారంభంలో జిల్లా కలెక్టర్**

**సామర్లకోట, జూలై 29 :అనంత జనశక్తి న్యూస్**

సమాజంలో మహిళల ఆర్థిక స్వలంబనే లక్ష్యంగా మహిళల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యసాధన కోసం మహిళలను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు కాకినాడ జిల్లాలో నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సామర్లకోట టిటిడిసిలో మహిళల కోసం చేపట్టిన వివిధ పథకాలను పర్యవేక్షణలో భాగంగా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ వెదురు మొక్కల పెంపకం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి, పారిశ్రామిక వ్యాపార కల్పన కోసం కుట్టు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయగా, పెద్ద ఎత్తున మహిళలు శిక్షణ ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. వెదురు మొక్కల పెంపకం ద్వారా నాలుగు సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వరకు భారీ ఆదాయం మహిళలు సాధించాలన్న లక్ష్యంతో వెదురు సాగు పైలెట్ ప్రాజెక్టు ప్లాంటేషన్ చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. వెదురుతో వెయ్యి లాభాలు పొందవచ్చునన్న సత్యాన్ని ఈ ప్రాజెక్టు నిరూపిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వెయ్యిమంది ని మహిళా రైతులుగా తీర్చి దిద్దనుండగా ఇప్పటి వరకు 760 మందిని సిద్ధం చేసామన్నారు. ప్రధానంగా ఈ వెదురు సాగుకు పైలెట్ మండలాలుగా మెట్ట ప్రాంతాలు అయిన జగ్గంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం మండలాలను ఎంపిక చేసి



నట్టు కలెక్టర్ చెప్పారు. అక్కడ వెదురు సాగు ప్రగతిని బట్టి మిగిలిన మండలాల్లో అమలు చెయ్యనున్నట్టు ఆయన చెప్పారు. ఇంకా విత్తసఖీ కార్యక్రమం లో భాగంగా ప్రజలకు వివిధ సేవలను అందించేందుకు వీలుగా ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉండగా జిల్లాలో 30వేలమంది మహిళా పారిశ్రామిక వేత్తలు తయారీ లక్ష్యంగా కలిగినట్టు చెప్పారు. దానికనుగుణంగా డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఇప్పటికే విత్తసఖి శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి, ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తాయని కలెక్టర్ వివరించారు. ముందుగా టిటిడిసిలో వేదురు ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి, మహిళలకు అందిస్తున్న కుట్టు శిక్షణ, చేపల పెంపకం పథకాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విత్త సఖి శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించి, మహిళలకు ఆయన దిశ నిర్దేశం చేశారు. అలాగే స్థానిక టిటిడిసికి పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశగా కొద్ది నెలల్లోనే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించునున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. దీని కేంద్రంగా మహిళల జీవనోపాది కార్యక్రమాలు మెరుగు పరచనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి శ్రీనివాస్ ఎపిడి జిలాని, డిపిఎం లు విబి ఆర్ రాయ్, టి బాబురావు, భరత్, ఎపిఎం అనిల్ కుమార్, సఖినా ప్రియదర్శిని, దుర్గాప్రసాద్, డిఆర్డిఏ, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరంలో ఘనంగా అతి భారీ జాతీయ పతాక ర్యాలీ

**- పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**- వరల్డ్ రికార్డు సాధించిన 3,600 అడుగుల పొడవైన త్రివర్ణ పతాక ప్రదర్శన**

**- వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 4.5 కిలోమీటర్ల మేర సాగిన భారీ ర్యాలీ**

**రాజమహేంద్రవరం, జులై 29, అనంత జనశక్తి న్యూస్**

వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నగరంలో ప్రప్రథమంగా నిర్వహించిన 3600 అడుగుల అతిభారీ జాతీయ జెండా ర్యాలీ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. జె.ఎన్. రోడ్డులోని మన్యం గార్డెన్స్ వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆనాల వెంకట అప్పారావు రోడ్డు, హ్యాపీ స్ట్రీట్ మీదుగా తిరిగి మన్యం గార్డెన్స్ వరకు దాదాపు 4.5 కిలోమీటర్ల



మేర ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. 3,600 అడుగుల పొడవుతో రూపొందించిన ఈ జాతీయ పతాకం 'వరల్డ్ రికార్డు' సాధించగా, మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా నిర్వాహకులతో కలిసి పతాకాన్ని చేతబూని ప్రదర్శనలో ముందుకు సాగారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... నగర పుర వీధులన్నీ త్రివర్ణ శోభితమై దేశభక్తి భావనలతో నిండిపోయిన వేళ, ఇంతటి చారిత్రాత్మక జాతీయ పతాక ప్రదర్శనలో పాల్గొనడం ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని తెలిపారు. దేశభక్తిని చాటుతూ ఈ వినూత్న కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను ఆయన అభినందించారు.ఈ భారీ ర్యాలీలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్ధా వెంకట సూర్య ప్రకాష్ రావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు బోడా వీర్రాజు, ఎరుకుల్ల రామ కృష్ణ, పువ్వాడ నారాయణ, దొంతి లక్ష్మీనారాయణ గుప్త, బోడా సాయి సూర్యప్రకాష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యాలయంలోనే మద్యం మత్తు..!



**- ములకలేడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈపై ఆరోపణలు – విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజల డిమాండ్**

**శెట్టూరు, జూలై 29 ,అనంత జనశక్తి న్యూస్**

ప్రజలకు నిరంతరం విద్యుత్ సేవలు అందించాల్సిన విద్యుత్ శాఖలోనే బాధ్యతారాహిత్యానికి తావిస్తున్న ఘటన శెట్టూరు మండలంలో చర్చనీయాంశంగా మారింది. మండలంలోని ములకలేడు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) చాంద్ బాషా తన కింది స్థాయి సిబ్బందితో కలిసి కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సోమవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఏఈతో పాటు సిబ్బంది మద్యం సేవిస్తుండగా మీడియా దృష్టికి వచ్చినట్లు సమాచారం. మీడియా చిత్రీకరణ చేపట్టగా అక్కడున్న లైన్‌మ్యాన్, ఆపరేటర్ కెమెరాలకు ఏఈ కనిపించకుండా అడ్డుపడి ఆయనను రక్షించేందుకు ప్రయత్నించినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు.విద్యుత్ శాఖ ప్రజలకు ఇరవై నాలుగు గంటల అత్యవసర సేవలు అందించే కీలక విభాగం. విద్యుత్ అంతరాయాలు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, అత్యవసర మరమ్మతుల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అలాంటి బాధ్యతాయుతమైన అధికారి విధి నిర్వహణ స్థలంలోనే మద్యం సేవించడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారి తరచూ కార్యాలయంలోనే మద్యం సేవిస్తున్నారనే ఆరోపణలు గతం నుంచే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. "ఇక్కడ నేనే బాస్... నేను వస్తే అన్నీ ఉండాలి" అంటూ సిబ్బందిపై ఆదేశాలు జారీ చేస్తుంటారని కూడా ఆరోపిస్తున్నారు. దీంతో కార్యాలయ వాతావరణం దెబ్బతినడంతో పాటు ప్రజలకు అందాల్సిన సేవలపై ప్రభావం పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడమే ఇటువంటి ఘటనలకు కారణమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలికి తీసి, తప్పు నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.



## అధికారంలో ఉన్న ఐదేళ్లు ఏం చేశారు?

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**- పలకరింపు రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టలేరు...**

**-ఉత్తరాంధ్ర అభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం**

**- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్**

**- డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారాలకు మంత్రి అచ్చెన్నాయుడు ఘాటు కౌంటర్... వాస్తవాలపై చర్చకు రావాలని సవాల్**

**- ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకున్న వైసీపీకి ప్రజలకు సమాధానం చెప్పే నైతిక హక్కు లేదు**

**- భోగాపురం విమానాశ్రయం నుంచి నేరడి బ్యారేజీ వరకు ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది**

**భోగాపురం, జూలై, 29, అనంత జనశక్తి న్యూస్**

భోగాపురం విమానాశ్రయ ప్రాంగణం: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వారికి ఇప్పుడు ప్రజలకు నీతులు చెప్పే హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో వలసల నివారణ, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన వంటి కీలక అంశాల్లో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌లు అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరాంధ్రకు తీసుకొచ్చిన ప్రాజెక్టులు ఏమిటో, కల్పించిన పెట్టుబడులు, ఉద్యోగాలు ఎక్కడున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి అభివృద్ధిని ఉత్తరాంధ్ర అభివృద్ధికి వ్యతిరేకంగా చిత్రీకరించడం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, నేరడి బ్యారేజీ, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక ప్రాజెక్టులను వేగంగా అమలు చేస్తోందన్నారు.

**భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు అభివృద్ధి ద్వారం**

ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమవడం చారిత్రక ఘట్టమని మంత్రి తెలిపారు. ఆగస్టు 16న సింగపూర్ నుంచి తొలి అంతర్జాతీయ విమానం రానుండగా, ఆగస్టు 17 నుంచి సాధారణ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఈ విమానాశ్రయం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరిగి ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని పేర్కొన్నారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి, భూసేకరణ పూర్తి చేసి 2019లో శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఇచ్చిన 500 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవడం ద్వారా ప్రాజెక్టును జాప్యం చేసిందని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి ప్రత్యేక జీవో జారీ చేసి భూములను పునరుద్ధరించి పనులకు వేగం తీసుకొచ్చిందన్నారు. భోగాపురం విమానాశ్రయం కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, దానికి అనుబంధంగా ఏవియేషన్ రంగానికి ప్రత్యేక విశ్వవిద్యాలయం, పరిశ్రమలు, భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే ప్రాజెక్టుగా ఇది నిలవబోతోందన్నారు.

**మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేస్తున్న విమర్శలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పకుండా, ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, నేరడి బ్యారేజీ, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ఎన్డీఏ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే రాజకీయ విమర్శలు కాకుండా వాస్తవాలు మాట్లాడాలని ధర్మాన ప్రసాదరావుకు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

నేరడి బ్యారేజీ - 60 ఏళ్ల కలను సాకారం చేస్తున్న ఎన్డీఏ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఒక్క ఎకరానికైనా కొత్త సాగునీరు అందించలేదని మంత్రి ప్రశ్నించారు. దశాబ్దాలుగా శ్రీకాకుళం జిల్లా ప్రజల కలగా ఉన్న నేరడి బ్యారేజీ ప్రాజెక్టును ఒడిశాతో వివాదం పేరుతో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించి కేంద్రం నుంచి గెజిట్ నోటిఫికేషన్ సాధించిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో రూ, 641 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించారని, రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**బాధిత కుటుంబానికి అండగా నిలవాలి**

శ్రీకాకుళం పర్యటనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి, జైలులో ఉన్న మాజీ మంత్రి ని పరామర్శించడం కంటే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యాదవ దానయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి న్యాయం జరిగేలా అండగా నిలవాలని మంత్రి సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చట్టం తన పని తాను చేస్తే దానిని గౌరవించాల్సిందేనని అన్నారు. చట్ట ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేయకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సహకరించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలకు వైసీపీ స్వస్తి చెప్పాలని మంత్రి హితవు పలికారు. ప్రజలు విమర్శలను కాదు, అభివృద్ధిని కోరుకుంటున్నారని, ఎన్డీఏ ప్రభుత్వం అదే దిశగా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



**డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారాలకు మంత్రి అచ్చెన్నాయుడు ఘాటు కౌంటర్... వాస్తవాలపై చర్చకు రావాలని సవాల్**

డీఎస్సీ నియామకాలపై వైసీపీ అధ్యక్షుడు చేస్తున్న అసత్య ఆరోపణలు, తప్పుడు ప్రచారాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం సరికాదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధ్యక్షుడు చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉంటే ఆధారాలతో ప్రజల ముందుకు రావాలని, తాను కూడా వాస్తవాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను పట్టించుకోని వైసీపీ నేతలు ఇప్పుడు ఉద్యోగాల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టలేరని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# సంత్ గురు రవిదాస్ సంకల్ప్ అభియాన్‌తో సామాజిక సమరసతకు శ్రీకారం

**- ధర్మవరంలో ఘనంగా బీజేపీ అసెంబ్లీ సంస్థాగత సమావేశం....**
**- బూత్ స్థాయి నుంచే పార్టీ విజయానికి పునాది వేయాలని పిలుపు....**

**ధర్మవరం జూలై 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం "సంత్ గురు రవిదాస్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ సంస్థాగత సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతం, బూత్ నిర్వహణ, ఓటరు నమోదు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమాలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెల్లి మధుసూదన్, శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ కునిగిరి నీలకంఠ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ నాయకులు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏలు, శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.
సంత్ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జూలై 29 గురుపౌర్ణమి నుంచి 2027 ఫిబ్రవరి 10 వరకు "సంత్ గురు రవిదాస్ సంకల్ప్ అభియాన్" నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, సోదరభావం, మానవత్వం సందేశాన్ని ప్రపంచానికి అందించిన మహనీయుడు సంత్ గురు రవిదాస్ అని కొనియాడారు.
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సైతం సంత్ గురు రవిదాస్ బోధనల నుంచి ప్రేరణ పొందిన విషయాన్ని గుర్తు చేస్తూ, గ్రామాలు, దళితవాడలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆయన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమరస సమాజ నిర్మాణమే ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
అనంతరం జరిగిన బీజేపీ అసెంబ్లీ సంస్థాగత సమావేశంలో మాట్లాడుతూ, "కార్యకర్తలే పార్టీకి వెన్నెముక... ప్రతి బూత్ బీజేపీకి విజయ ద్వారం కావాలి" అని నాయకులు అన్నారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ), బీఎల్ఏ-2 కార్యక్రమాలపై సమగ్రంగా వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతను ఓటరు జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ నమోదులు, ఇతర తప్పులను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సవరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
కొత్త ఓటరు జాబితా విడుదలైన తర్వాత ప్రతి బూత్‌లో సమగ్ర పరిశీలన నిర్వహించి, పార్టీకి అనుకూలమైన ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరచుకోవాలని, బూత్ కమిటీలను మరింత చురుకుగా పనిచేయించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.




ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ స్థాయిలో పార్టీకి సేవలందించిన అనుభవజ్ఞుడైన నాయకుడు ధర్మవరం ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా, అనంతరం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు.
మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, సంక్షేమం తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజానాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.
మంత్రి సత్యకుమార్ యాదవ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరియు రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని, ప్రజల విశ్వాసమే పార్టీ విజయానికి అసలైన బలమని నాయకులు పేర్కొన్నారు.
ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెల్లి మధుసూదన్, జిల్లా ఇన్‌చార్జ్ కునిగిరి నీలకంఠ, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేషు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, పట్టణ, మండల అధ్యక్షులు జింక చంద్రశేఖర్, దేవర రామ్మోహన్, అంజన్ రెడ్డి, ఆకులేటి భాస్కర్, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన డీఎస్పీ బీవీ జగన్నాథ రాజుకు ఘన సన్మానం




**ధర్మవరం జూలై 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బీవీ జగన్నాథ రాజు ని తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు కిరోసిన్ పోతలయ్య, సాకే కుళ్లయ్యప్ప, గజ్జల సుబ్రమణ్యం, కత్తే నాగరాజు తో పాటు పార్టీ నాయకులు డీఎస్పీని కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.
నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని, ధర్మవరం నియోజకవర్గంలో ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేయాలని ఆకాంక్షిస్తూ తమ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, దళిత నాయకులు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ. కోటి వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

**సామర్లకోట, జూలై 29 :అనంత జనశక్తి న్యూస్**

సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వారికి ఘన స్వాగతం పలికి, గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టనున్న ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ జెడ్పిటిసి గుమ్మళ్ళ విజయలక్ష్మి రామకృష్ణ పాల్గొని కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన నిలిచిపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి వసతులు, పారిశుద్ధ్య పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు సాగునీరు అందుబాటులోకి రావడంతో పంట పొలాలు సస్యశ్యామలంగా మారుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కంటే కేవలం బటన్ నొక్కే కార్యక్రమాలకే పరిమితమైందని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా సమర్థవంతమైన పాలన కొనసాగుతోందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతు తెలుపుతూ అభివృద్ధికి అండగా నిలవాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అందుగుల మాణికుమారి, జార్జి చక్రవర్తి, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న మరిడమ్మ అమ్మవారి శాఖంభారీ అలంకారం...



**పెద్దాపురం, జూలై 29 :అనంత జనశక్తి న్యూస్**

దేశవ్యాప్తంగా ప్రసిద్ధికెక్కిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దానిలో భాగంగా బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దేవస్థానం అధికారులు, వేద పండితులు, ఆశాధులు శాకాంబరి మాతగా ప్రత్యేక రీతిలో ఆకర్షణీయంగా అలంకరించారు. అమ్మవారితో పాటు దేవాలయ ప్రాంగణాలన్నీ వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అందంగా తీర్చిదిద్దారు. అలాగే అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టారు. దేవస్థానం, అధికారిణి, సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

# విద్యుత్ బిల్లులు సులభతరంగా చెల్లించవచ్చు!!

**- విద్యుత్ డిప్యూటీ డిఈ ఈ.. లక్ష్మీ నరసింహ రెడ్డి.**

**ధర్మవరం జులై 29, అనంత జనశక్తి న్యూస్:**



విద్యుత్ బిల్లును ఎక్కడైనా ఎప్పుడైనా సులభంగా చెల్లించే అవకాశం ఉంది అని విద్యుత్ శాఖ (ఏపీఎస్పీడీసీఎల్) డిప్యూటీ డి ఈ లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రస్తుతం ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ ప్రజల కోసం బిబిపిఎస్ అందుబాటులోకి వచ్చింది అని తెలిపారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టం (బి బి పిఎస్) ద్వారా సురక్షితమైన డిజిటల్ చెల్లింపు ఉంటుంది అని తెలిపారు. అంతేకాకుండా ఫోన్‌పే ద్వారా, గూగుల్ పే ద్వారా, పేటీఎం ద్వారా, అమెజాన్ పే ద్వారా, ఇతర అన్ని బి బి ఎస్ బ్యాంకింగ్ యాప్స్ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. డిజిటల్ పేమెంట్ ప్రయోజనాలులో సురక్షితం, నమ్మదగినదని, 24X7 అందుబాటులో ఉంటుందని, తక్షణ బిల్లు చెల్లింపు, క్యాష్ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేదు అని తెలిపారు, డిజిటల్ రసీదు కూడా పొందే అవకాశం ఉందని తెలిపారు. మీ విద్యుత్ కన్జ్యూమర్ నెంబర్ను ఎంచుకొని కొన్ని ట్యాప్పులలో బిల్లు చెల్లించవచ్చునని తెలిపారు. క్యూఆర్ ద్వారా కూడా బిల్లు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకొని విద్యుత్ శాఖ అభివృద్ధికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# పంచాయతీ కార్యదర్శి పై ఫిర్యాదు...

**యల్లనూరు, జులై 29, అనంత జనశక్తి న్యూస్;**

యల్లనూరు మండలంలోని దంతలపల్లి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న హరి పై సచివాలయ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు బుధవారం ఇంచార్జ్ ఎంపీడీఓ మనోహర్ బాబుకు ఫిర్యాదు చేశారు. పంచాయతి కార్యదర్శి విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు, గ్రామాలలో సమస్యలను పట్టించుకోవడం లేదని, అలాగే ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు, మరణ ధ్రువీకరణ పత్రాలు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ఇలా ప్రతి పనికి రూ. 3వేల నుండి రూ.5వేల వరకు ముడుపులు చెల్లించుకోవాల్సిందే అంటూ ఫిర్యాదు దారులు వాపోయారు. కావున తక్షణమే అతనిపై చర్యలు తీసుకొని మరో పంచాయతీ కార్యదర్శిని దంతలపల్లి సచివాలయానికి నియమించాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.




# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా

**యాడికి, జూలై 29, అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్నశ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారుమ్రోగింది. అయ్యప్పస్వామి కి మహా మంగళహారతి ని సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను, భిక్ష ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

# నేడు నామ సప్తాహము ముగింపు కార్యక్రమం

**యాడికి, జూలై 29, అనంత జనశక్తి న్యూస్**



మండల కేంద్రంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం నామ సప్తాహము ముగింపు కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గంటలకు శ్రీ అయ్యప్ప స్వామి కి విశేష పంచామృత అభిషేక కార్యక్రమం, 9 గంటలకు క్షీరతర్పణం కార్యక్రమం ,9:35 నిమిషములకు నామస్మరణ ముగింపు కార్యక్రమం, 9:40 నిమిషములకు విశేష హారతులు, తదుపరి మహా మంగళహారతి కార్యక్రమం ను నిర్వహించడం జరుగునని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు, అన్న ప్రసాదము జరుగునని తెలిపారు . కావున భక్తులందరు తప్పకుండా హాజరై, అయ్యప్ప స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# విజయంబికదేవి అమ్మకు సారే వడిబియ్యం సమర్పణ



**యాడికి, జూలై 29, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని భైరవ కొండపై వెలసిన శ్రీ శ్రీ శ్రీ విజయంబిక భైరవలింగేశ్వర స్వామి దేవాలయం లో బుధవారం ఆషాడ పౌర్ణమి సందర్భంగా విజయ అంబికా అమ్మకు సారే వడిబియ్యంను భక్తులు సమర్పించారు. ఉదయం భైరవ లింగేశ్వర స్వామి కి, విజయాంబిక దేవి అమ్మకు ఉదయం అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు. అర్చనలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు. పసుపు కుంకుమ ,పూలు ,పళ్ళు పట్టు వస్త్రాలను యాడికి పురవీధుల్లో భాజా భజంత్రీలతో శోభాయాత్రగా భక్తులు వెళ్లి సమర్పించారు. దాదాపుగా వంద రకాల తిండి పదార్థాలు విజయాంబిక దేవి అమ్మకు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ దేవాలయంలో ఘనంగా "గురు పౌర్ణమి" వేడుకలు

**అగళి జూలై 29,అనంత జనశక్తి న్యూస్**



అగళి మండలంలోని ఎం.ఎం.పాల్యం గ్రామములో దత్తాత్రయ స్వామి దేవాలయంలో అగళి ఆర్యవైశ్యులు ఎం.ఎస్.ప్రకాష్, ఎం.ఎస్. రాదక్రిష్ణ,బాలాజీ, నవీన్ ఆద్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు బుదవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా లయంలో తెల్లవారుజమున ఉదయం నుండి దత్తాత్రేయ స్వామికి వివిధ రకాల పూలతో అలకరించి వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

అనంత జనశక్తి
గురువారం | అనంతపురం
30.07.2026



# అల్లు అర్జున్ గొప్ప మనసు.. ఫ్యాన్స్‌కు ఉచిత ప్రమాద బీమా!






ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన అభిమానుల పట్ల ఉన్న అంతులేని ప్రేమాభిమానాలను మరోసారి చేతల్లో చూపించాడు. కేవలం తెరపైనే కాకుండా, నిజ జీవితంలోనూ తమను ఆదరించే అభిమానుల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన ఒక అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ వేదికగా ఘనంగా జరిగిన 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్' (AAFA) వార్షిక సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైంది. ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర సహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా ఫ్యాన్ అసోసియేషన్ ప్రముఖులు, ప్రధాన నాయకులు అత్యంత ఉత్సాహంగా హాజరయ్యారు.

అయితే ఈ ప్రత్యేక వేదికపై అల్లు అర్జున్ ఏడు రాష్ట్రాల నుంచి విచ్చేసిన తన అభిమానులందరికీ ఎటువంటి సభ్యత్వ రుసుములు లేకుండా, పూర్తిగా ఉచిత ప్రమాద బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ గొప్ప సంక్షేమ పథకం కింద రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులకు రూ. 5 లక్షలు, అలాగే జిల్లా స్థాయి కమిటీ సభ్యులకు రూ. 3 లక్షల వరకు ప్రమాద బీమా కవరేజ్ లభించనుంది. అంతేకాకుండా, ఈ బీమాకు సంబంధించిన అధికారిక కార్డులను స్వయంగా తన చేతుల మీదుగా అభిమానులకు అందించి వారిలో సరికొత్త జోష్ నింపారు.

సినిమాల సక్సెస్‌లను పంచుకోవడమే కాకుండా, కష్టసుఖాల్లోనూ తన అభిమానుల కుటుంబాల భద్రత మరియు భవిష్యత్తు ఎంతో ముఖ్యమని భావించి బన్నీ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయంపై ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ ప్రశంసల వర్షం కురుస్తోంది. కేవలం రీల్ హీరోగానే కాకుండా తన ఆర్మీకి నిజమైన రక్షణ కల్పిస్తున్న అల్లు అర్జున్‌ను నెటిజన్లు, అభిమానులు 'అసలైన రియల్ హీరో' అంటూ ఎంతో గర్వంగా కొనియాడుతున్నారు.

# హాలీవుడ్ హీరోను తలపించిన రామ్ పోతినేని లేటెస్ట్ లుక్..

## ఈ స్టైలిష్ లుక్ వెనుక అసలు కథ ఏంటి?





టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మరోసారి తన సరికొత్త లుక్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ప్రతి సినిమాకు కొత్త మేకోవర్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే రామ్.. ఈసారి కూడా పూర్తి స్టైల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో అభిమానులను ఆకట్టుకున్నాడు. తాజాగా ఆయనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, వాటిపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వైరల్ అవుతున్న ఫొటోల్లో రామ్ వైట్ టీ-షర్ట్, వైట్ క్యాప్, బ్లాక్ జాకెట్ ధరించి, స్టైలిష్ సన్‌గ్లాసెస్‌తో ఎంతో డ్యాషింగ్‌గా కనిపించాడు. దీనికి తోడు దట్టమైన గడ్డం, క్లాస్ లుక్‌ను మరింత హైలైట్ చేసే వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ ఆయన స్టైలింగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్‌లో రామ్ కనిపించిన తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

ఈ ఫొటోలు బయటకు వచ్చిన వెంటనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వేగంగా వైరల్ అయ్యాయి. "హాలీవుడ్ హీరో రేంజ్ లుక్", "అల్టిమేట్ స్టైల్ ఐకాన్", "నెక్స్ట్ లెవెల్ మేకోవర్", "రామ్ స్టైల్‌కు సాటి లేరు" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన గడ్డం, క్యాప్, సన్‌గ్లాసెస్ కాంబినేషన్ ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. రామ్ పోతినేని తన కెరీర్ ప్రారంభం నుంచి ప్రతి సినిమాకు భిన్నమైన లుక్‌లో కనిపిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. పాత్రకు తగ్గట్టుగా శరీరాకృతి, హెయిర్‌స్టైల్, గడ్డం, డ్రెస్సింగ్ స్టైల్ వరకు మార్పులు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఆయన ప్రత్యేకత. అందుకే ఆయన కొత్త ఫొటోలు బయటకు వచ్చిన ప్రతిసారీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంటుంది.

ఇప్పుడు వైరల్ అవుతున్న ఈ లుక్ కూడా ఆయన రాబోయే సినిమా కోసమేనా? లేక ఏదైనా ప్రత్యేక ఫోటోషూట్‌లో భాగంగా చేసిన స్టైలింగ్ మాత్రమేనా? అనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం లేదా రామ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం రామ్ తన తదుపరి ప్రాజెక్ట్‌కు సంబంధించిన అప్డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ఆయన కొత్త లుక్ సోషల్ మీడియాలో భారీగా ట్రెండ్ అవుతూ, కొత్త సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అధికారిక సమాచారం లేకపోయినా, రామ్ తాజా మేకోవర్ మాత్రం అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ నెట్టింట వైరల్‌గా మారింది.

# కలతేలా కలతేలా..

విశాల్ హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి సమర్పణలో బి.సురేశ్, ఆర్బీ జీవన్ చౌదరి, జితన్ రమేశ్, జీవా నిర్మిస్తున్నారు. అంజలి, దుషార విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "కలతేలా కలతేలా.. మదిలో నీకీ కలతేలా.." అంటూ సాగిన ఈ పాటకు జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలు సమకూర్చగా.. రాజశ్రీ సుధాకర్ సాహిత్యమందించారు. కృష్ణ తేజస్వీ ఆలపించారు. ఈ పాటని తీర్చిదిద్దిన తీరును బట్టి.. ఇందులో యాక్షన్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యమున్నట్లు అర్థమవుతోంది. ఇందులో విశాల్ భార్య పాత్రలో దుషారా కనిపించనుంది. త్వరలోనే



# బీసీసీఐ కొత్త ప్రణాళికలు.. షమీ కెరీర్ ఇక ముగిసినట్లేనా?



మెగా టోర్నీల్లో అడుగు పెడితే.. వికెట్ల వర్షం కురిపిస్తాడు. ద్వైపాక్షిక సిరీసుల్లో కంటే ఐసీసీ ఈవెంట్లలో సత్తా చాటడమే ఇష్టపడతాడు. మరి అలాంటి సీనియర్ స్టార్ పేసర్ షమీకి టీమ్ఇండియా తలుపులు తెరుచుకోవడం లేదు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కూ అతడిని ఎంపిక చేయలేదు. తాజాగా మరొక పిడుగులాంటి కథనం ఈ సీనియర్ పేసర్ పాలిట చేదు గుళికలా తయారైంది.

టీమ్ఇండియా వెటరన్ పేసర్ మహమ్మద్ షమీ చివరిసారిగా జాతీయ జట్టుకు ఆడి సంవత్సరం దాటిపోతోంది. గత ఛాంపియన్స్ ట్రోఫీ చివరి వన్డే ఆడాడు. అదే ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో చివరి టీ20లో తలపడ్డాడు. ఇక టెస్టు మ్యాచ్ ఆడి కూడా మూడేళ్లు దాటిపోయింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. గత ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ షమీనే కావడం గమనార్హం. ఇక దేశవాళీలోనూ పశ్చిమ్ బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించిన షమీ.. కేవలం ఏడు మ్యాచుల్లోనే 37 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు.

నీరజ్ చోప్రాకు ఇప్పుడు ఒకరు కాదు.. ఇద్దరు ప్రధాన ప్రత్యర్థులు

యువ బౌలర్లతో పోటీ పడి మరీ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. బుమ్రాతో షమీ కలిస్తే టీమ్ఇండియా పేస్ మరింత పదునెక్కడం ఖాయం. కానీ, 35 ఏళ్ల సీనియర్‌ను కాదని.. యువ పేసర్ల వైపు బీసీసీఐ సెలక్టర్లు దృష్టిసారించారు. గత వన్డే ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలో షమీ బౌలింగ్ మెరుపులే లేకుండా ఉంటే.. టీమ్ఇండియా ప్రదర్శన ఆ స్థాయిలో ఉండేది కాదు.

15 మందితో కూడిన..

మొన్నటి వరకూ ఏదొక సమయంలో షమీకి అవకాశం దక్కుతుందని అతడి అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ, బీసీసీఐ సెలక్టర్లు 15 మందితో కూడిన యంగ్ పేస్ పూల్‌ను సిద్ధం చేశారనే వార్త ఇప్పుడు షమీ ఆశలకు తెరదించినట్లైంది. రాబోయే టెస్టు ఛాంపియన్‌షిప్,

2027 వన్డే ప్రపంచ కప్ సన్నాహకాల్లో భాగంగా ఎక్కువగా కుర్రాళ్లకే అవకాశం ఇవ్వాలనేది గంభీర్ - అగార్కర్ కాంబో ప్రణాళిక. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ నడుస్తోంది. ఇందులో టీమ్ఇండియా ఫైనల్‌కు వెళ్లే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయి. దీంతో 2027-29 సైకిల్‌పైనా ఫోకస్ పెట్టేలా పేస్ దళాన్ని సిద్ధం చేయడం కూడా మేనేజ్‌మెంట్ వ్యూహాల్లో ఒకటి. ఇప్పటికే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో పరివర్తన దశ మొదలైంది. సీనియర్ల స్థానాల్లో యువకులు వచ్చేస్తున్నారు.

షమీ ఏం చేస్తాడో?

ఇప్పుడున్న యువ పేసర్లలో నిలకడ లేదనేది కాదనలేని వాస్తవం. బుమ్రా కు సరైన సహకారం ఇవ్వడంలో ప్రసిద్ధ్, సిరాజ్, అర్ష్‌దీప్ విఫలమవుతున్నారు. ఏదో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే మంచి ప్రదర్శన ఇస్తున్నారు. గాయాల కారణంగా బుమ్రా దూరమైన స్థితిలో కుర్రాళ్లను ముందుండి నడిపించే బాధ్యతను సీనియర్ షమీకి ఇస్తే బాగుంటుందనేది చాలామంది భావన. జట్టు పరివర్తనకు షమీ అనుభవం కూడా పనికొస్తుందని వారి వాదన. హార్డ్ లెంగ్త్ వేయడంలో షమీ దిట్ట. అతడు ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన అవసరమూ లేదు. వయసు కారణంగా చూపిస్తుండటం మాత్రం షమీకి ప్రతికూలంగా మారింది. కానీ, ఫిట్‌నెస్‌తోపాటు ఫామ్ ఉంటే అదేమంత సమస్య కాదు. ఈ విషయంలోనూ బీసీసీఐ పెద్దలు ఆలోచన చేయాలనేది క్రీడా పండితుల సూచన. ఇలాగే పక్కన పెడుతూ ఉంటే మాత్రం త్వరలోనే షమీ నుంచి 'వీడ్కోలు' ప్రకటన వచ్చే అవకాశం లేకపోలేదు.

# టాపర్లు మనోళ్లే.. వైభవ్ సూర్యవంశీ మొదలుపెట్టాడు

టీమ్ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐసీసీ ర్యాంకుల్లో వేట మొదలుపెట్టాడు. ఇంగ్లాండ్‌పై అరంగేట్రం చేసిన అతడు.. ఆ టీ20 సిరీస్‌లో ప్రభావం చూపించలేదు. కానీ, జింబాబ్వేపై విజృంభించిన వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. మూడు వన్డేల్లో 151 పరుగులు చేశాడు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో దూసుకొచ్చాడు. ఏకంగా 230 స్థానాలను ఎగబాకడం గమనార్హం. దీంతో అనతికాలంలోనే వైభవ్ టాప్ -50లో అడుగు పెట్టాడు. ప్రస్తుతం 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానంలో ఉన్నాడు.

ఇషాన్ 1.. అభిషేక్ 3

టీ20ల్లో అగ్రస్థానం భారత క్రికెటర్ ఇషాన్ కిషన్ దే. అతడు 910 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఇంగ్లాండ్‌పై ఫర్వాలేదనిపించిన అభిషేక్ శర్మ జింబాబ్వేపై తేలిపోయాడు. దీంతో అతడి ర్యాంక్‌పైనా ప్రభావం పడింది. ఒక స్థానం కోల్పోయిన అభిషేక్ (819) మూడో ర్యాంకుకు పడిపోయాడు. పాకిస్థాన్ ఆటగాడు సహిబ్జాద ఫర్హాన్ (848) రెండో ర్యాంకుకు చేరాడు. తిలక్ వర్మ (750) రెండు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక టీ20 బౌలింగ్ విభాగంలో టాప్ -10లో భారత్ నుంచి ఒకే ఒక్క బౌలర్ మాత్రమే ఉన్నాడు. వరుణ్ చక్రవర్తి (663) మూడు స్థానాలను కోల్పోయినా 9వ ర్యాంకులో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా ఐదు స్థానాలను కోల్పోయాడు. ప్రస్తుతం 17వ ర్యాంకులో కొనసాగుతున్నాడు.

వన్డేల్లో శుభ్‌మన్ గిల్ టాప్ ప్లేస్

వన్డే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న కివీస్ ఆటగాడు డారిల్ మిచెల్ (794) రెండో స్థానానికి పడిపోయాడు. గిల్ ఖాతాలో ప్రస్తుతం 801 పాయింట్లు ఉన్నాయి. టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ (767), రోహిత్ శర్మ (758) వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలింగ్ విభాగంలో భారత్ నుంచి టాప్-10లో ఒక్కరూ లేరు. కుల్‌దీప్ యాదవ్ (596) మాత్రం 11వ స్థానంలో ఉన్నాడు.

ఇక జట్లపరంగా.. వన్డే, టీ20ల్లో టీమ్ఇండియా అగ్రస్థానంలో ఉంది. టెస్టుల్లో మాత్రం నాలుగో ర్యాంకులో నిలిచింది. టీ20ల్లోనూ ఇంగ్లాండ్ (268)తో భారత్ (268)కు తీవ్ర పోటీ తప్పడం లేదు.



# నీరజ్ చోప్రాకు ఇప్పుడు ఒకరు కాదు.. ఇద్దరు ప్రధాన ప్రత్యర్థులు

జావెలిన్ త్రో అనగానే ఇద్దరు ప్లేయర్లే గుర్తుకొస్తారు. అందులో ఒకరు భారత అథ్లెట్ నీరజ్ చోప్రా (Neeraj Chopra) కాగా.. మరొకరు పాకిస్థాన్ క్రీడాకారుడు అర్షద్ నదీమ్. ఇప్పటి వరకు నీరజ్‌కు ప్రధాన పోటీదారుడు అర్షద్ మాత్రమే. కానీ, ఈసారి కామన్వెల్త్ గేమ్స్‌లో వీరిద్దరికి మరొక ప్లేయర్ నుంచి తీవ్ర పోటీ ఎదురు కానుంది. అతడు కూడా దక్షిణాసియా నుంచే కావడం గమనార్హం. గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ (Common Wealth Games) జరుగుతున్నాయి. జావెలిన్ త్రో కోసం క్రీడాభిమానులు ఎదురు చూస్తున్నారు. అందుకు కారణం భారత్ నుంచి ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా బరిలోకి దిగడమే. అతడికి అర్షద్ నదీమ్ (పాకిస్థాన్) నుంచి తీవ్ర పోటీ ఎదురుకానుంది. ఈ రేసులోకి శ్రీలంకకు చెందిన రుమేశ్ తరంగ పతిరగె వచ్చాడు. గోల్డ్ మెడల్‌పై కన్నేసిన నీరజ్ - నదీమ్‌కు తరంగ నుంచి ప్రతిఘటన తప్పదని నిపుణుల అంచనా. ముక్కోణపు పోటీలో బంగారు పతకం ఎవరిని వరిస్తుందోనని అందరిలోనూ ఆసక్తి మొదలైంది.

ఫుల్ ఫిట్‌గా నీరజ్..

2018 కామన్వెల్త్ గేమ్స్‌లో పసిడి పతకం అందుకొన్న నీరజ్ చోప్రా .. 2022 ఎడిషన్‌కు గాయం కారణంగా దూరమయ్యాడు. ఇప్పుడు మళ్లీ బరిలోకి దిగిన అతడు కచ్చితంగా గోల్డ్ మెడల్ సాధిస్తాడని భారత చీఫ్ కోచ్ బలంగా చెబుతున్నాడు. గాయాల నుంచి కోలుకుని పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉండటం కలిసొచ్చే అంశం. మొన్నటి వరకూ 90 మీటర్ల దూరం విసరలేడేమోనని అనుకుంటే.. ఆ లోటును గత సీజన్‌లోనే పూరించాడు. 90.23 మీటర్ల దూరం విసిరి జాతీయ రికార్డును నెలకొల్పాడు. దాదాపు తొమ్మిది నెలలపాటు గాయాలతో ఇబ్బంది పడిన అతడు.. ఇప్పుడు ఉత్సాహంతో బరిలోకి దిగుతున్నాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314